ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 3 డిసెంబరు 2024





మిర్చి యార్డులో కలవరం

గుంటూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వందల కోట్ల రూపాయల అక్రమాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి రావటంతో గుంటూరు మిర్చియార్డులో కలవరం మొదలైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో యార్డులో పనిచేసిన 20 సిబ్బంది పేర్లు చేర్చటం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు అధికారులు, ఇద్దరు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీలు, ఇద్దరు యార్డు ఇన్‌చార్జీలు, 12మంది సూపర్‌వైజర్లపై తీవ్రమైన అభియోగాలు నమోదు అయినట్లు తెలుస్తోంది. నివేదికను ఆధారం చేసుకుని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉండటంతో గత ఐదేళ్లలో యార్డులో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెత్తున్నాయి.ప్రస్తుతం అప్పట్లో పనిచేసిన సిబ్బందిలో కొద్దిమంది మాత్రమే యార్డులో ఉన్నారు. మిగిలినవాళ్లు ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. యార్డులో ప్రస్తుతం 34మంది పనిచేస్తుండగా, 10మంది పేర్లు విజిలెన్స్ నివేదికలో ఉన్నట్లు సమాచారం.

- అధికారులు, ఇద్దరు సెక్రటరీలపై తీవ్ర అభియోగాలు
- ఇద్దరు ఇన్‌చార్జీలు, 12 మంది సూపర్‌వైజర్లపై కూడా
- విజిలెన్స్ విచారణతో చర్యలకు ఆదేశించనున్న ప్రభుత్వం

ఆదాయం కోసం స్థాయి మార్పు..

గుంటూరు మిర్చియార్డులో ప్రతి ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతుండగా, రూ.100కోట్ల వరకు ఆదాయం చేకూరుతోంది. వాస్తవానికి గుంటూరు మిర్చియార్డుకు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీని నియమించాలి. అర్హత కలిగిన సెక్రటరీలు ఉన్నప్పటికీ మార్కెటింగ్ కమిషనర్‌తో సత్సంబంధాలు కలిగిన అధికారులు స్థాయి తగ్గించుకొని అధిక ఆదాయం కలిగిన

(మిగతా 8వ పేజీలో..)

డైరెక్టర్ సీరియస్ ?

గుంటూరు మిర్చియార్డులో జరుగుతున్న అవకతవకలపై వస్తున్న కథనాలపై మార్కెటింగ్ డైరెక్టర్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కమిషనర్ కార్యాలయం ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతోనే కొందరిపై వేటుపడవచ్చని చెబుతున్నారు.





బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో ఇటీవల అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం



ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూల మూలకు విస్తరించి వున్న రేషన్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అక్రమార్కుల ఆట కట్టించేందుకు ప్రయత్నించినా ఏమాత్రం వెరువని రేషన్ మాఫియా తాజా పరిణామాల నేపథ్యంలో ఒకింత ఆందోళనకు గురయింది. నేరుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం రేషన్ మాఫియాపై దృష్టి సారించడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మాఫియా ఏరేషన్!

- ప్రభుత్వం దృష్టి సారించడంతో అధికారుల అప్రమత్తం
- కఠిన చర్యలు తప్పవంటూ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు హెచ్చరికలు
- గత కొంతకాలంగా ఇష్టారాజ్యంగా రేషన్ మాఫియా
- సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా పేదల బియ్యం దోపిడీ
- బినామీ షాపులతో అడ్డూ అదుపులేని అక్రమాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో విస్తరించిన రేషన్ మాఫియా జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి రేషన్‌మాఫియా అక్రమాలు ఖండాంతరాలు చేరింది. సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణ మీదుగా కర్ణాటక, గుజరాత్, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు పేదల బియ్యాన్ని తరలించడమే కాకుండా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు కూడా తరలిస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. వీటిని కట్టడి చేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమాలు మాత్రం అణువంత కూడా తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. స్వయంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టి, అక్రమార్కులపై చర్యలకు ఉపక్రమించారు. దీంతోపాటు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హెచ్చరికలు చేయడంతో మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెత్తు తున్నాయి. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్ర హెచ్చరికలు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు కూడా రేషన్‌మాఫియాపై అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, విజిలెన్స్, రెవిన్యూ అధికారులు మాఫియాకు హెచ్చరికలు పంపించారు. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఇటు రేషన్‌డీలర్లకు, అటు ఎండీయూ వాహనదారులకు హెచ్చరికలు పంపారు.

అడ్డూ అదుపులేని రేషన్ మాఫియా..

పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం రేషన్ షాపులకు చేరకముందే మాఫియా గూటికి చేరిపోయిన ఘటనలు జిల్లాలో అనేకం నమోదయ్యాయి. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రజలకు అందాల్సిన బియ్యం ముందు నెల 25వ తేదీ లోపు రేషన్ షాపులకు చేరుతుంది. కానీ కిందటి నెల 28వ తేదీకల్లా అనేక రేషన్ షాపులు ఖాళీ అయిపోయాయి. బియ్యం అక్రమార్కుల చెంతకు చేరిపోయాయి. దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకున్నా పద్ధతిలో మార్పు రాలేదు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి నేరుగా మాఫియాకు..

రేషన్ డీలర్లకు బియ్యం అందించే మండల స్థాయి స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్ల నుంచే నేరుగా పేదల బియ్యం మాఫియా డంప్‌కు చేరిపోతున్న ఘటనలు అత్యంత ఆందోళనకర పరిణామం. జిల్లాలో రెండు మూడు రేషన్ షాపులు ఒక్కటై ఈ దందా చేస్తున్నాయి. మూడు షాపుల్లో ఒక షాపుకు స్టాకు రాకుండా నేరుగా మాఫియాకు పంపిస్తారు. మిగిలిన రెండు షాపులు మూడో షాపుకు సరుకు సరఫరా చేస్తాయి. అధికారుల తనిఖీల సమయంలో ఒకరికి ఒకరు సహకరించుకుని తప్పించుకుంటున్నారు. దీంతోపాటు చాలా చోట్ల రేషన్ షాపు పక్కన మాఫియా స్టాక్ పాయింట్ పెట్టుకుని అక్కడే బియ్యాన్ని డంప్ చేసుకుని

(మిగతా 8వ పేజీలో..)





- సీఐడీ 'నాట్ ట్యాలీడ్' ఉచ్చు నుంచి రైతులకు విముక్తి
- కలెక్టర్ విచారణతో నాట్ ట్యాలీడ్ జాబితా రైతులకు మోక్షం
- కేటగిరీ 1, 2, 3 నుంచి 609 మందికి, 5,6 కేటగిరీల్లో 484 మందికి కౌలు
- రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదు
- ఏపీ సీఆర్డీఏ కమిషనర్

అసైన్డ్ రైతులకు కౌలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతుల్లో మరో 1,093 మంది రైతులకు కౌలు కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వం నమోదు చేసిన సీఐడీ కేసుల కారణంగా 'నాట్ ట్యాలీడ్' జాబితాలో చేరి అనర్హతబారిన పడి మూడేళ్లుగా కౌలుకు, చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలకు దూరమైన అసైన్డ్ రైతులకు కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం కలిగింది. గత నెల 28వ తేదీన అంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'రిజిస్ట్రేషన్ల గండం' వార్తపై సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ స్పందించారు. తొలి విడత జాబితా కింద ఈ ఏడాది ఆగస్టులో 1,234 మంది అసైన్డ్ రైతులను 'నాట్ ట్యాలీడ్' జాబితా నుంచి విముక్తి చేసి కౌలు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో 1,093 మందికి కౌలు చెల్లించనున్నామని, వారి రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకమూ ఉండబోదని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు.

కలెక్టర్ విచారణ అనంతరం విముక్తి

రాజధాని కోసం ఎల్‌పీఎస్ స్కీము కింద భూములిచ్చిన అసైన్డ్ రైతులను ఆరు కేటగిరీలుగా గుర్తించామని చెప్పారు. కేటగిరీ-1 గా మాజీ సైనికులు, స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ బాధితుల భూములు, కేటగిరీ- 2, 3 కింద 1954కి ముందు అసైన్ చేసిన భూములు, కేటగిరీ- 4 కింద శివాయజమేదార్లుగా పరిగణించిన భూములు, కేటగిరీ- 5 కింద అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులు, కేటగిరీ- 6 కింద అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూముల్లో అర్హులైన ఆక్రమణదారులుగా గుర్తించారు. ల్యాండ్ పూలింగ్‌లో వీరంతా భూములివ్వగా అప్పటి టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో..)

6

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

- సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ

4.2 కిలోల గంజాయి స్వాధీనం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు మరో 14 రోజుల రిమాండ్

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

- ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం

8

విడిపోతాం

- భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
- అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు



వీరారాధన ఉత్సవాల్లో ముగిసిన 'మందపోరు'

- కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు



బ్రహ్మనాయుడి వేషధారణ చేస్తున్న చేతుబానిన ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి తదితరులు

గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యం

- రూ. 861 కోట్లతో రహదారులకు మరమ్మతులు
- వైసీపీ నిర్లక్ష్యంతోనే అధ్వాన రహదారులు
- ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

నరసరావుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంతల రహిత రహదారులే ప్రభుత్వ లక్ష్యం.. సంక్రాంతి కల్లా రహదారులకు మరమ్మతులు పూర్తిచేస్తాం. ఇందుకు రూ 861 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రహదారులు పూర్తిగా అధ్వానస్థితికి చేరాయని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో జరుగుతున్న రహదారుల మరమ్మతు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని, త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు కష్టపడి పనిచేయాలన్నారు.

పల్నాడు జిల్లాలో రూ.38.65కోట్ల వ్యయంతో 133 పనులు చేపట్టామన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించకపోవడంతో రహదారుల పనులు నిలిచి పోయాయన్నారు. రాష్ట్రంలో దాదాపు 3,300 కిలోమీటర్లు పీపీపీ మోడల్‌లో ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఫీజుబులిటీ ఆధారంగా 4 లైన్ల రోడ్లను నిర్మిస్తాం.. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 76 వేల కోట్లతో జాతీయరహదారుల పనులు జరుగుతు న్నాయని చెప్పారు. పల్నాడు జిల్లాలో రాజుపాలెం నుంచి అమరావతి వరకు ఉన్న ప్రధానరహదారి 44.60 కిలోమీటర్ల రహదారిని రెండులైన్ల రహదారిగా నాబార్డ్ సహాయంతో రూ.142.80కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కృష్ణానదిపై మాదిపాడు వద్ద పెద్దవంతెన నిర్మాణం రూ. 60.54కోట్లు మంజూరుచేయడంతో పాటు టెండరు ప్రక్రియ పూర్తయి పనులు వివిధదశల్లో ఉన్నాయన్నారు.

సేతుబంధన్ పథకం ద్వారా బెల్లంకొండ, పిడుగురాళ్ళ రైల్వే ఓవర్ బ్రిడ్జి మధ్య పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 2 రోడ్ల పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సీఆర్‌ఐఎఫ్ పథకం కింద రూ. 58 కోట్లతో 46 కి.మీ మేర పనులు మంజూరయాయన్నారు. జిల్లాలో వరద నష్టం మరమ్మతుల కింద రూ. 20 కోట్లతో 226 కి.మీ మేర 70 పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతుల పనులు, నూతన పీహెచ్‌సీల పనులు కూడా ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయని తెలిపారు. దాదాపు రూ. 1000 కోట్లు గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు చెల్లించడంతో కాంట్రాక్టర్లు తిరిగి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రోడ్లు గుంతలమయంగా మారడంతో, అన్ని రహదారులు అధ్వాన స్థితికి చేరాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించక పనులు కూడా నిలిచిపోయిన పరిస్థితి ఉందన్నారు.

నరసరావుపేట-చిలకలూరిపేట రహదారి విస్తరించాలని మంత్రిని పలువురు కోరారు. దీనిపై అయన సానుకూలంగా స్పందించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో రూ 5 కోట్ల వ్యయంతో రహదారుల పనులు చేపట్టామన్నారు. నరసరావుపేట - చిలకలూరిపేట రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ఆధ్యాత్మిక కేంద్రం కోటప్పకొండ వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని రహదారిని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నరసరావుపేట మండలంలోని పెట్లూరివారి పాలెం వద్ద జరుగుతున్న రహదారి మరమ్మతుల పనులను బీసీ జనార్ధన్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో మధులత, ఆర్‌అండ్‌బీ ఎస్సీ రాజా నాయక్, ఈఈ నరేంద్ర, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండ రహదారి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



బ్రాహ్మణపల్లి బాలాజీ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో మధులత (ఫైల్)

పట్టుబడిన 42 క్వింటాళ్లు రేషన్ బియ్యంగా నిర్ధారణ

వినుకొండ టౌన్, డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లులో పట్టుబడిన బియ్యాన్ని ల్యాబ్‌లో పరీక్షల ఆధారంగా పీడీఎస్ బియ్యంగా అధికారులు నిర్ధారించారు. నవంబరు 17 తేదీన ఆర్డీవో మధులత ఆకస్మిక తనిఖీ చేయగా, సుమారు 42 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్‌లో పరీక్షల ఆధారంగా పీడీఎస్ బియ్యంగా అధికారులు నిర్ధారించారు. దీంతో పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు సీఎస్ డీటీ విద్యాసాగర్ సోమవారం తెలిపారు.

గంజాయి, మత్తు చాక్లెట్లు స్వాధీనం

నరసరావుపేట లీగల్, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈటి గ్రామంలో సోమవారం 170 గ్రాముల డ్రై గంజాయి, 400 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ సోమవారం తెలిపారు .ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది సోమవారం ఈటి గ్రామంలో ఓ బడ్డీ బంకులో తనిఖీలు చేసి దుకాణం నిర్వహిస్తున్న ఒరిస్సాలోని పూరీ జిల్లాకు చెందిన ఉదయానంద్ నుంచి 170 గ్రాముల డ్రై గంజాయి, 400 మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు ఒరిస్సా నుంచి ఈ గంజాయి చాక్లెట్లను తెచ్చినట్లు తేలిందన్నారు. గంజాయిని 10గ్రాముల ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కొక్కటి సుమారు రూ.200కు రిక్షా పుల్లర్స్‌కు, కార్మికులకు, కళాశాల, పాఠశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. సెవెన్ మినార్ అనే పేరుతో ఉన్న చాక్లెట్లను ఆయుర్వేద చాక్లెట్లు పేరుతో పాఠశాల విద్యార్థులకు కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. చాక్లెట్లలో 14శాతం మత్తు పదార్థం ఉంటుందన్నారు. గంజాయి నిరోధానికి, సరఫరా, విక్రయం, వాటిని వినియోగించే వారిపై కూడా తగు నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా కళాశాలల విద్యార్థులకు విక్రయించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. కార్యక్రమంలో నర్సరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈ ఎస్‌కే రవీంద్ర, సీఐ సోమయ్యలు పాల్గొన్నారు.

పూలింగ్ ద్వారా భూములు తీసుకోవాలని తీర్మానం


గ్రామసభలో చేసిన తీర్మానాన్ని చూపిస్తున్న సర్పంచి పద్మజ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించే రైల్వేలైనుకు సంబంధించి మండల పరిధిలోని కర్లపూడి గ్రామానికి చెందిన 240 ఎకరాలు పూలింగ్ ద్వారా తీసుకోవాలని కర్లపూడి గ్రామస్తులు, రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రైల్వేలైన్‌కు అవసరమైన 430 ఎకరాల్లో 240 ఎకరాలు కర్లపూడి గ్రామానికి చెందినదని గ్రామస్తులు తెలిపారు. సోమవారం సాయంత్రం సర్పంచి ఎం.పద్మజ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో రైతులు పాల్గొని తమ భూమిని పూలింగ్ ద్వారా ప్రభుత్వం తీసుకుని రాజధాని ప్రాంత రైతులకు మాదిరిగా న్యాయం చేయాలని తీర్మానించారు. ఇటీవల రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి రైతులు కలిశారు. రైల్వేలైనుకు తీసుకునే భూమికి కేంద్ర ప్రభుత్వ నష్ట పరిహారం, రాష్ట్ర ప్రభుత్వం 400 గజాల స్థలం ఇస్తుందని హామీ ఇచ్చారు. దీనికి రైతులు సర్పంచి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి పూలింగ్ ద్వారా భూములు ఇచ్చేందుకు నిర్ణయించారు. అలాకాకపోతే రైలు మార్గాన్ని రాజధాని నుంచి నిర్మించుకోవాలని రైతులు తెలిపారు. గతంలో కర్లపూడి రైతులకు చెందిన అనంతవరం, నెక్కల్లు గ్రామ రెవెన్యూ పరిధిలోని 140 ఎకరాలు పూలింగ్‌కు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఉషారాణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీలో గుంటూరు మహిళల ప్రతిభ

● ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో మొదటి బహుమతి కైవసం


బహుమతిని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ చేతుల మీదగా అందుకుంటున్న లక్ష్మీసామ్రాజ్యం

గుంటూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఢిల్లీ వేదికపై ప్రతిభను చాటారు. నవంబరు 14వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన 43వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ సరస్ మేళాలో అధిక ఉత్పత్తులు విక్రయించి దేశ స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. ఈ నేపథ్యంలో మంగళగిరి మండలంలోని స్నేహ మహిళా గ్రూపు సభ్యురాలైన జి.లక్ష్మీసామ్రాజ్యంను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్మీ, ఆమె భర్త మధుబాబు మంగళగిరి చేనేత వస్త్రాలు (చీరలు, డ్రెస్ మెటీరియల్ మొదలైనవి) మేళాలో ప్రదర్శించి 15 రోజుల్లో మిగిలిన మహిళల అందరికంటే ఎక్కువ అమ్మకాలు జరిపినట్లు వెల్లడించారు. జిల్లా మహిళా సంఘ సభ్యురాలికి మొదటి బహుమతి రావడం గర్వకారణం అన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం


యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కుమార్‌రాజా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు సోమవారం తెలిపారు. గౌరవాధ్యక్షుడుగా షేక్ ఖాసీమ్ పీరా, అధ్యక్షుడుగా కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షుడుగా జె.వాల్యా నాయక్, సహాధ్యక్షురాలుగా ఎ.బాగేశ్వరిదేవి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహనరావు, కోశాధికారిగా ఎం.రవిబాబు ఎన్నికైయ్యారు. కార్యవర్గం చేత రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎన్.కుమార్‌రాజా ప్రమాణ స్వీకారం చేయించారు. జీవో 117ను రద్దు చేసి పాఠశాలల విలీన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, బోధన సమయాన్ని హరిస్తున్న యాప్‌ల భారాన్ని తీసివేయాలని, ఉపాధ్యాయుల సమయాన్ని కేవలం బోధనకే కేటాయించేలా చూడాలని నూతన కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్‌సీ కమిషన్‌లను ఏర్పాటు చేసి తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

మిర్చి వ్యాపారస్తులతో నేడు అధికారుల భేటీ

● ఉదయం 11 గంటలకు దిగుమతి వ్యాపారస్తులతో సమావేశం
● సాయంత్రం 4 గంటలకు ఎక్స్‌పోర్టర్లతో మీటింగ్
● సర్క్యులర్లు జారీ చేసిన సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులతో మంగళవారం సమావేశం కావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు అధికార యంత్రాంగం నిర్ణయించింది. మంగళవారం ఉదయం కమిషన్, సాయంత్రం ఎక్స్‌పోర్టు వ్యాపారస్తులతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటుకు షెడ్యూల్ ఖరారు చేశారు. వ్యాపారస్తులంతా ఆయా సమావేశాలకు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రధానంగా మిర్చియార్డులో ఈ-నామ్ విధానం లాట్ ఐడీలు జనరేట్ చేయడం మొదలుకొని లాట్ ఎగ్జిట్ వరకు అన్ని దశలలో అమలు చేయాల్సి ఉంది. అలానే బిల్ టూ బిల్, కటింగ్, జీరో వ్యాపారాలన్నీ పూర్తిగా నిలిపేయాలి. వీటితోపాటు మరికొన్ని అంశాలపై సమావేశాల్లో చర్చించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలకు మార్కెటింగ్ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యే అవకాశం ఉన్నది.

ఈనామ్ అమలు నామమాత్రమే..

జాతీయ వ్యవసాయ మార్కెట్‌ని ఈనామ్‌గా పరిగణిస్తారు. 2016లో ఈనామ్ అమల్లోకి వచ్చింది. ఈనామ్‌లో రైతులు, ట్రేడర్లు, బయ్యర్లు ఉంటారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఈనామ్‌లో మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి టిక్కీలకు తొలుత లాట్ ఐడీని జనరేట్ చేస్తారు. వాటికి సంబంధించిన శాంపిల్స్‌ని ఈనామ్‌లో ప్రదర్శిస్తారు. వాటికి ఎగుమతిదారులు ఆక్షన్‌లో ధర పేర్కొనాలి. ఆ ధర రైతుకు ఇష్టమైతేనే విక్రయించాలి. లేదంటే తిరస్కరించొచ్చు. ఆక్షన్ అయిపోగానే వెంటనే కాటాలు వేసి ఆ రోజే నగదు చెల్లింపు చేయాలి. ఇది కూడా ఆన్‌లైన్‌లో జరగాలి. ఈనామ్‌కు మొబైల్ యాప్ కూడా ఉండటం వలన సెల్‌ఫోన్‌లోనే అటు రైతులు, ఇటు వ్యాపారస్తులు అన్ని విషయాలను చూసుకోవచ్చు. అయితే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేంద్ర ప్రభుత్వ ఈ-నామ్ విధానం అమలు నామమాత్రంగా ఉంది. ఇతర ప్రాంతాలకు చెందిన ఎక్స్‌పోర్టర్లు ఎవరూ ఇక్కడి మిర్చిని కొనుగోలు చేయరు. తొలుత స్థానిక ఎగుమతిదారులు కమీషన్ వ్యాపారుల దుకాణాలకు వెళ్లి మిర్చి శాంపిల్స్‌ని చూసి ఎంత మోతాదులో సరుకు ఉందో తెలుసుకుంటారు. ఆ తర్వాత కమీషన్ వ్యాపారి, రైతు సమక్షంలో ధర మాట్లాడుకుని ఎలాంటి పోటీ లేకుండా ఈనామ్ ఆక్షన్‌లో పాల్గొని సరుకుని దక్కించుకుంటారు. దీనివలన గతంలో మూస పద్ధతిలో జరిగిన లావాదేవీలకు, ఈనామ్‌లో జరుగుతున్న ట్రేడింగ్‌కు ఎలాంటి వ్యత్యాసం లేకుండా పోయింది. యార్డులో వ్యాపారస్తులంతా సిండికేట్ అయి ఉన్నారు. ఏమైనా ఒత్తిడి పెడితే వెంటనే ట్రేడింగ్ నిలిపేసి రైతులకు ఇబ్బందులు కలిగిస్తారు. గతంలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయి. కొన్ని రోజులుగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తుండటంతో మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత సోమవారం యార్డు సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులుకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి అన్నీ ఈనామ్‌లోనే జరగాలని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మంగళవారం వ్యాపారస్తులతో సమావేశాలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

ఏపీఎంను సస్పెండ్ చేయాలి

● గొట్టిపాడు డ్వాక్రా సంఘాల ఆందోళన


రోడ్డుపై గొట్టిపాడు డ్వాక్రా మహిళల ధర్నా

ప్రత్తిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు గంటల పాటు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్నా, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆగ్రహించిన గొట్టిపాడు డ్వాక్రా సంఘాల మహిళలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఏపీఎంను సస్పెండ్ చేయాలంటూ రాస్తారోకోకు దిగారు. గొట్టిపాడులోని రాధాకృష్ణ గ్రామైక్య సంఘానికి సంబంధించి వీవోఏ జె.శ్రీకాంతను తొలగించే విషయంతో కొంతకాలంగా రచ్చ జరుగుతుంది. ఆ గ్రామైక్య సంఘానికి సంబంధించి డ్వాక్రా సంఘాల ప్రమేయం లేకుండా అధికారులు వీవోఏను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే శ్రీనిధి బయోమెట్రిక్‌లో ఆధార్‌ను మార్చారంటూ ఆ సంఘం మహిళలు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు, ఆధారాలతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సుమారు 50 మంది మహిళలు వచ్చారు. తొలుత తహసీల్దార్ కరుణ కుమార్ వచ్చి మహిళలతో మాట్లాడారు. అర్జీ ఇస్తే నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు ఏపీఎం వచ్చి సమాధానం చెప్పాలని మహిళలు పట్టుబట్టారు. బయటకు వచ్చిన ఏపీఎంను బయోమెట్రిక్ ఆధార్‌ను ఎందుకు మార్చారో చెప్పాలంటూ మహిళలు ప్రశ్నించారు. అంతేకాకుండా తమ సంఘానికి సంబంధం లేకుండా వీవోఏను ఎందుకు మార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రూపునకు వీవోఏ ఎవరో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పరిశీలించి సమాధానం చెబుతానని ఏపీఎం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆగ్రహించిన మహిళలు ఏపీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన్ను సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ట్రాఫిక్ కొద్ది సేపు ఆగిపోయింది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అనంతరం డ్వాక్రా సభ్యురాలు గుంటుపల్లి శివకుమారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

పోలీసులకు ఏపీఎం ఫిర్యాదు

మహిళలు తన చేయి పట్టుకుని లాగి కొట్టబోయారని ఆరోపిస్తూ ఏపీఎం లాజర్ ప్రత్తిపాడు ఎస్‌ఐ నాగేంద్రకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అసైన్డ్ రైతులకు కౌలు

(5 పేజీ తరువాయి)

వీరికి చట్టబద్ధమైన కౌలు, ప్రయోజనాలు కల్పించింది. అయితే గత ప్రభుత్వం 1, 2, 3 కేటగిరీల భూములపై సీఐడీ కేసులు నమోదు చేయడం వల్ల ఆ రైతులకు సంవత్సరాది కౌలు, నివాస స్థలాలు, వాణిజ్య ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేసింది. వాటిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి నివేదికను సీఐడీ అధికారులకు పునఃపరిశీలన నిమిత్తం పంపగా తొలి విడతలో 1,234 మంది రైతులకు అర్హత లభించిందని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలు ఇస్తున్నట్లు ఈ ఆగస్టులో సీఆర్డీఏ, ప్రభుత్వం ప్రకటించింది. 1,234 మందికి వార్షిక కౌలు రూ. 22. 03 కోట్ల రూపాయలు జమ చేసింది.

● రెండో విడతలో..

రెండో విడతగా మరో 609 మంది రైతులకు అర్హత లభించిందని సీఆర్డీఏ కమిషనర్ తెలిపారు. వారికి రూ.2.35 కోట్లకు ప్రతిపాదనలు ఆమోదించగా, బిల్లు ఆర్థిక శాఖ వద్ద ఫండ్ క్లియరెన్సులో ఉన్నట్లు ఆయన వివరించారు. వారికి కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు తగిన చర్యలు అధికారులు చేపట్టారని తెలిపారు. నాట్ ట్యాలీడ్ జాబితాలో వున్న 5, 6 కేటగిరీల రైతుల పొలాలపై కూడా విచారణ జరపగా 484 మంది రైతులకు అర్హత లభించిందని ఈనెల 27న వారి కౌలు చెల్లింపులకు ఆమోదం లభించిందని, వారికి కౌలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఆయన తెలియజేశారు. వారి ప్లాట్ల రిజిస్ట్రేషన్లకూ ఆటంకం ఉండదని, త్వరతగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామని సీఆర్డీఏ కమిషనర్ తెలియజేశారు. కాగా 1,2,3 కేటగిరీలకు చెందిన అర్హత కలిగిన 683 మంది రైతుల వివరాలను జిల్లా కలెక్టర్ ఈనెల 26న సీఆర్డీఏ కార్యాలయానికి పంపగా దానిని సీఐడీ అధికారుల పునఃపరిశీలనకు పంపించారు. వారి ఆమోదం లభిస్తే వారికి కూడా వార్షిక కౌలుతోపాటు, చట్టపరంగా రావాల్సిన ప్రయోజనాలు అందనున్నాయి.

జాతి పరువు తీయడం.. దేశద్రోహమే

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఒప్పందాల్లో రూ.1750 కోట్లు ఇచ్చినట్లు న్యూయార్క్ కోర్టులో జగన్, కొంతమంది అధికారుల పేర్లతో ఛార్జిషీటు దాఖలు అయిందని, ఇది దేశద్రోహం కిందకు వస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడంతో జాతి పరువు పోయిందనీ, కనుక ఇది దేశద్రోహమేనని చెప్పారు. రూ. 1750 కోట్లు రికవరీ చేయాలని, అందులోని నిందితులపై దేశద్రోహం కింద కేసు నమోదు చేయాలన్నారు. కోటిన్నర టన్నుల బియ్యాన్ని కృష్ణపట్నం, మచిలీపట్నం, కాకినాడ, వైజాగ్ పోర్టుల ద్వారా దోపిడీ చేశారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ పోర్టుల సందర్శనలో బియ్యం అక్రమ రవాణాను చూశాం అన్నారు. సుమారు రూ.50 వేల కోట్ల సంపద అన్నారు. ఇది పేద ప్రజలు తినే ఆహారం అన్నారు. జగన్ బృందం పేదల తీసుకునే ఆహారాన్ని కూడా వదలిపెట్టారా అని మాజీ మంత్రి ప్రశ్నించారు.

నందిగం సురేశ్‌కు మరో 14 రోజుల రిమాండ్


పోలీసు వ్యానులో నుంచి అభివాదం చేస్తున్న నందిగం సురేశ్

మంగళగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. తుళ్లూరుకు చెందిన మరియమ్మ అనే వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించి సురేశ్ జ్యుడీషియల్ రిమాండ్‌లో వున్నారు. రిమాండ్ గడువు సోమవారం ముగియడంతో పోలీసు వ్యానులో మంగళగిరి కోర్టుకు తీసుకువచ్చారు. న్యాయమూర్తి మరో 14 రోజులపాటు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. అనంతరం సురేశ్‌ను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

ఏసీ సర్వీసుల ఛార్జీలపై రాయితీ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏసీ సర్వీసులపై టిక్కెట్ ఛార్జీల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఆదివారం మినహా సాధారణ రోజుల్లో మాత్రమే రాయితీలు వర్తిస్తాయని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. అమరావతి ఏసీ సర్వీసుకు టిక్కెట్ ఛార్జీల్లో 20 శాతం రాయితీ ఉంటుందన్నారు. అమరావతి ఏసీ సర్వీసుకు 20 శాతం రాయితీ అంటే రూ. 742ల నుంచి రూ.593కు ఛార్జీ తగ్గించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంద్ర (బీహెచ్‌ఈఎల్) ఏసీ సర్వీసుకు 10 శాతం రాయితీపై రూ.585 నుంచి రూ.526కు ఛార్జీని వసూలు చేయనున్నట్లు తెలిపారు. రాయితీ ఈ నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు అమల్లో ఉంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న హైమారావు వేదికపై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

గుంటూరు (విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పాఠశాలలు బలోపేతం దిశగా అడుగులు వేస్తూ ముందుకు పోతుందనీ, ప్రతి శుక్రవారం గుర్తింపు పొందిన సంఘాలతో ముందుగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటున్నారని త్వరలో ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ అన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం మంగళగిరిలోని ఎన్జీఓ భవన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సెలవులపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరాజు, చిగురుపాటి పినాకపాణి, జిల్లా నాయకులు యుగంధర్, బాలా త్రిపుర సుందరి, క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

4.2 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

చేబ్రోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ సంచరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 4.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి డీఎస్పీ డి.జనార్దనరావు సోమవారం తెలిపారు. చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఆదివారం చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్సై డి.వెంకటకృష్ణ సోదాలు నిర్వహిస్తుండగా కామధేను సీడ్ కంపెనీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ముగ్గురు అనుమానితులను గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హృదానంద దాస్, ప్రసన్న రౌత్రే, జడజన నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 4.2 కిలోల గంజాయి ఉంది. ఈ ముగ్గురు ఒడిశా నుంచి గంజాయిని నారాకోడూరు తీసుకువచ్చి వాటాలు వేసుకుని పంచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. చిన్న చిన్న పొట్లాలుగా గంజాయిని మార్చి యువతకు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నట్లుగా చెప్పారు. కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్సై వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఆశం లింగారెడ్డి (35) నివాస గృహంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు లింగారెడ్డిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతునికి గతంలో రూ.15 లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ ఏడాది కూడా 2 ఎకరాల పత్తి, 3 ఎకరాల మిరప పంటలను సాగు చేశాడు. ఈ ఏడాది కూడా పంటలు సక్రమంగా లేకపోవడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం

దాచేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆటో సాంకేతిక లోపంతో సడన్‌గా ఆగిపోవడంతో వెనుక వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఆటోను వెనుక వైపు ఢీకుని మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం నల్లసముద్రం గ్రామానికి చెందిన మోతుకూరి ఏడుకొండలు (32)గా గుర్తించారు. ఏడుకొండలు హైదరాబాద్ నుంచి ఒంగోలుకు హోండా షైన్ వాహనంపై వస్తున్నాడు. అతనికి ముందుగా వెళ్తున్న ఆటో సడన్‌గా ఆగిపోయింది. వేగంగా ప్రయాణిస్తున్న ఏడుకొండలు వేగాన్ని నియంత్రించలేక ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

రాజుపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - మాచర్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన రాజుపాలెం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన తురకా ప్రసాదు (32) తన ఆటోలో చంద్రాజుపాలెం నుంచి సత్తెనపల్లి వెళ్తుండగా మార్గమధ్యలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారాలు వద్దకు వచ్చేసరికే ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ తురకా ప్రసాదుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో సత్తెనపల్లి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ చెన్నై సర్వీసు పునరుద్ధరణ

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారం నుంచి ఆర్టీసీ చెన్నై సర్వీసును పునరుద్ధరించినట్లు గుంటూరు -1 డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. గుంటూరు-1 డిపో నుంచి చెన్నైకు నిత్యం ఉదయం 9.45 గంటలకు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బయల్దేరే సర్వీసును పునరుద్ధరించినట్లు తెలిపారు.


స్వాగతం సుస్వాగతం
కారంపూడి పల్నాటి
వీరుల తిరునాళ్ళ
సందర్భంగా నేడు జరుగు
కోడిపోరు ఉత్సవానికి
విచ్చేయుచున్న
అతిరథ మహారథులకు,
ఆచారవంతులకు,
నాయకులకు,
ప్రజా ప్రతినిధులకు,
మా మిత్రులకు,శ్రేయోభిలాషులకు
స్వాగతం – సుస్వాగతం
ఒప్పిచర్ల గ్రామములో శ్రీ గంగా పార్వతి సమేత
భీమలింగేశ్వరస్వామి వారి దేవస్థాన
నిర్మాణమునకు 50 లక్షల రూపాయలు
విరాళము ఇచ్చిన దాత
కీ॥శే॥ కందుల పుల్లయ్య మాస్టారు గారి
కుమారుడు - కోడలు
కందుల శ్రీనివాసరావు - మాధవి
మనుమడు: జశ్వంత్ చౌదరి
మనుమరాలు: ప్రజ్ఞశ్రీ చౌదరి
శ్రీ యరపతినేని శ్రీనివాసరావు గారు
శాసనసభ్యులు, గురజాల
శ్రీ జూలకంటి బ్రహ్మానందరెడ్డి గారు
శాసనసభ్యులు, మాచర్ల
స్వర్ణ సుబ్రమణ్యం - పిచ్చమ్మ
పిడుగురాళ్ళ
వడ్డవల్లి సర్వేశ్వరరావు
Ex. GDCC బ్యాంక్ డైరెక్టర్, పిడుగురాళ్ళ
కరణం కాశీవిశ్వనాథం
అడ్వకేట్, పిడుగురాళ్ళ
పాండురంగ శ్రీనివాసరావు
టౌన్ TDP అధ్యక్షులు, పిడుగురాళ్ళ
కనిగిరి శ్రీనివాసరావు
TDP వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, పిడుగురాళ్ళ
జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ
మండల TDP అధ్యక్షులు, గురజాల
పులుకూరి కాంతారావు
Ex. MPP, గురజాల
నేలవల్లి బొల్లయ్య
మున్సిపల్ కౌన్సిలర్, గురజాల
బెల్లంకొండ భద్రి
మండల TDP అధ్యక్షులు, దాచేపల్లి
నెల్లూరి శ్రీనివాసరావు
TDP నాయకులు, కేసానుపల్లి
గోళ్ళ నారాయణ
మాజీ సొసైటీ అధ్యక్షులు, నడికుడి
బడిగుంచల వెంకటేశ్వర్లు
మండల TDP అధ్యక్షులు, మాచవరం
షేక్ ఖాజావల్లి
మండల TDP ప్రధాన కార్యదర్శి, పిల్లుట్ల
యడ్లపల్లి రామారావు
నరసరావుపేట పార్లమెంట్
కార్యనిర్వాహక కార్యదర్శి, మాచవరం
యామిని రామారావు
TDP నాయకులు, కొత్తపాలెం
శ్రీ గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి
వారి దేవస్థానం కమిటి, ఒప్పిచర్ల
ప్రెసిడెంట్ మరియు మెంబర్స్

విడిపోతాం

భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు వెన్నుముక లాంటి వివాహ వ్యవస్థకు బీటలు వారుతున్నాయా....... "మూడు ముళ్లు, ఏడు అడుగులు,వందేళ్లు" అనే లెక్క తప్పుతుందా....... వైవాహికం లాంటి కీలకమైన బాధ్యతను తీసుకునేందుకు యువత విముఖత చూపుతున్నారా...... ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే అవుననే సమాధానం వస్తుంది.......చాలా మంది యాంత్రిక జీవితానికి అలవాటుపడి చిన్నపాటి కారణాలకే దూరం అవుదామని నిర్ణయించుకుని కోర్టు దాక వెళ్తున్నారు. దీనికి తోడు పరిష్కరించాల్సిన చుట్టుపక్కలవారు కూడా వీరికి మద్దతు తెలుపుతున్నారు. దాంపత్యం అంటే ఆకర్షణ, ప్రేమ కాదని అది స్నేహతో కూడిన అవగాహన, స్నేహతోకూడిన స్నేహం అని అర్థం చేసుకోలేక పోతున్నారు. ఒకరి భావాలను ఒకరు అర్థం చేసుకోకుండా.... ఆలోచనల్ని గౌరవించడం లేదంటూ వేదనకు గురవుతున్నారు. దీంతో నూరేళ్లు ఉండాల్సిన దాంపత్య జీవితాలు మధ్యలోనే ముగుస్తున్నాయి. అత్యంత పటిష్టమైన పెళ్లి అనే బంధం చిన్న చిన్న కారణాలతోనే తెగిపోతున్నది. ఈ మాత్రం దానికే విడాకులు తీసుకుంటున్నారా అంటూ న్యాయమూర్తులే విస్తుపోతున్నారు.





● పెళ్లైన నాలుగు నెలలు తిరగక ముందే టీవీ రిమోట్ దగ్గర మొదలైన గొడవ చినికి, చినికి గాలి వానలా మారి విడాకుల కోసం గుంటూరుకు చెందిన ఓ జంట కోర్టులో కేసువేశారు. ఏడాది వరకు విడాకులు ఇవ్వరని చెప్పడంతో అయితే అప్పుడే వస్తామని అంతేగాని కలసి ఉండటం కుదరదని చెప్పి అక్కడి నుంచి వెళ్కారు.

● మరో కేసులో పెళ్ల తరువాత పెట్టు పోతలు సరిగా చేయలేకపోయారని వరుడు కుటుంబానికి చెందిన వారు మాట్లాడిన మాటలు గొడవగా మారడంతో గుంటూరుకు చెందిన ఇరు కుటుంబాలు విడాకుల కోసం కోర్టుకు ఎక్కారు.

● మా అమ్మ, నాన్న మా ఇంటికి వచ్చిన పుడు చికెన్ తీసుకురాలేదని భార్య చేసిన గొడవ కోర్టు మెట్లు ఎక్కేవరకు తీసుకు వచ్చింది. చెప్పిన సమయానికి రాలేదనే.... ఇష్టమైన సినిమాకి తీసుకుపోలేదనే వంటి కారణాలకే కోర్టు వరకు వచ్చే ఘటనలు మరెన్నో..... గతంలో గురక పెడుతున్నాడని, తలుపుకు తాళం వేయడం మరిచిపోయారని వంటి కారణాలతో విడాకులు తీసుకున్నారనే వార్తలు విని నవ్వుకునేవాళ్లం... ప్రస్తుతం ఆ సంస్కృతి మన మధ్యలోకే రావడం విచారించదగ్గ విషయం.

గుంటూరు(తూర్పు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బలమైన బంధానికి నాంది కావాల్సిన అడుగులు తప్పటడుగులు అవుతున్నాయి. కుటుంబవ్యవస్థను భావితరాలకు అందించే వివాహవ్యవస్థ బలహీనపడుతుంది. వందేళ్ల కలసి బతకాల్సిన జీవితం చిన్నపాటి కారణాలతో విడిపోతున్నారు.



విడి విడిగా మంచి భర్త, మంచిభార్యగా ఉన్నవారు కూడా ఒక్కో సమయంలో మంచి భార్యభర్తలు కాలేరన్న సూత్రాన్ని గ్రహించలేకపోతున్నారు. పెళ్లైన ఆరు రోజుల నుంచి ఆర్నెల్లు గడవకముందే భాగస్వామి అర్థం కావడం లేదనో, అర్థం చేసుకోవడం లేదనో విడిపోవాలను కుంటున్నారు. ఒకరికి ఒకరు అర్థంగాకపోయినా జీవితాంతం కలిసి ఉండే బలమైన బంధమే దాంపత్యజీవితం అని గుర్తించ లేకపోతున్నారు. నిర్లిప్తత, ఒంటరితనం. ప్రేమరాహిత్యం, అస్పష్ట అపజయం అంటూ అర్థం లేని పేర్లు పెట్టి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు.

● మూణ్ణాళ్ల ముచ్చటగా వివాహబంధం
● భారీగా పెరుగుతున్న విడాకుల కేసులు
● ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో పెండింగ్ కేసులు
● కేసుల్లో 80 శాతం కొత్తగా పెళ్లైన జంటలవే
● చిన్నపాటి వివాదాలకే కోర్టు మెట్లెక్కుతున్న నవదంపతులు
● అక్కరకు రాని కౌన్సిలింగ్ కేంద్రాలు

పెద్దవారు లేకపోవడమే కారణం..

గతంలో విడాకుల కేసులు చాలా అరుదుగా వచ్చేవి. ప్రస్తుతం అవి వందల సంఖ్యలో వస్తున్నాయి. జిల్లా కోర్టులోనే నాలుగు సబ్‌కోర్టుల్లో విచారణ కొనసాగుతున్నాయి, ఉమ్మడి కుటుంబాలు, పెళ్లైన కొత్తలో పెద్దవారి పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. ఒక్కోసారి భార్యాభర్తల్లో ఒకరు కలిసి ఉండాలని మరొకరు విడిపోవాలని కోరుకుంటారు. ఇటువంటి కేసులు కూడా వస్తుంటాయి. విడాకులు వద్దని ఎంత చెప్పినా వినరు. తీసుకున్న తరువాత వచ్చే ఇబ్బందులు గురించి చెప్పినా పట్టించుకోరు. చిన్నపాటి సమస్యలు వచ్చినపుడు విడాకులు వరకు రావడం మంచిది కాదు. పెద్దవారి సమక్షంలో ఇరుకుటుంబాలు ఆరోగ్యకరమైన వాతవరణంలో పరిష్కరించుకోవాలి.



పల్లపు కృష్ణ, 5వ కోర్టు అదనపు జిల్లా జడ్జి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

పెరుగుతున్న కేసులు

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో జిల్లా కోర్టులో ఉన్న ఫ్యామిలీ కోర్టులో ప్రతినెల 40కు పైగా జంటలకు విడాకులు మంజూరు అవుతున్నాయి. అంటే సరాసరిని రోజుకు రెండు జంటలు వివాహ బంధానికి స్వస్తి చెబుతున్నాయి. అంతేగాక కార్పొరేషన్ పరిధిలో నవంబరు చివరినాటికి 3వేలకు వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నెలకు జిల్లాలోని అన్ని కోర్టుల్లో నెలకు 160 వరకు జంటలు విడాకులు పొందుతున్నాయి. ఫ్యామిలీ కోర్టుతో పాటు, జిల్లా కోర్టులో నాలుగు సబ్‌కోర్టులు, నరసరావుపేట, బాపట్ల, పిడుగురాళ్ల, వినుకొండ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 10 సబ్‌కోర్టుల్లో నిత్యం వీటి విచారణ కొనసాగుతుంది. సివిల్, క్రిమినల్ కేసుల కంటే అత్యధికంగా విడాకుల కేసులే విచారణ జరుగుతున్నాయంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

● పెళ్లయిన కొత్తలోనే సమస్య

అప్పటి వరకు ఉన్న వాతావరణం, ఆప్తులు పెళ్లి తరువాత కనిపించవు. అక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ సమయంలోనే చిన్నపాటి స్పర్థలు మొదలవుతాయి వీటిని పరిష్కరించుకోగలిగితే ఆ తరువాత ఎటువంటి ఇబ్బందులు ఉండవు. జీవితం రొటీన్ అవుతుందన్న భావన కూడా రానివ్వకూడదు. అంతేగాక బయటకు వెళ్లినపుడు ఒకరినొకరు గౌరవించుకోవాలి. గొడవలు జరిగితే సర్దుకుపోవాలి. చిన్నపాటి సూత్రాలు పాటించుకుంటే వివాహ జీవితం ఆనందంగా ఉంటుంది.



-డాక్టర్ వి వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీఎమ్‌సీ

అక్కరకు రాని కౌన్సెలింగ్ కేంద్రాలు

సాధారణంగా విడాకులకు దరఖాస్తు చేసుకున్న దంపతులను కలిపేందుకు తొలిప్రయత్నంగా కౌన్సెలింగ్ కేంద్రాలకు పంపుతారు. దంపతుల మధ్య గొడవకు కారణం కనుక్కోని వారి మధ్య సఖ్యతను కుదర్చడమే ఈ కేంద్రాల ముఖ్య విధి. కానీ జిల్లాలో కౌన్సిలింగ్ కేంద్రాలకు వెళ్లిన వారికి న్యాయం జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దిశ పోలీస్ స్టేషన్లలో, సఖి కేంద్రాల్లో జిల్లా వ్యాప్తం గా కౌన్సెలింగ్ సెంటర్లును ఏర్పాటు చేశా రు. కానీ ఇక్కడ సరైన మానసిక నిపుణు లు, అనుభవజ్ఞులు లేక చాలా కేసులు తిరిగి విడాకులకే దారి తీస్తున్నాయి. ఇతర రాష్ట్రాల మాదిరి గతంలో విడాకులు తీసుకుని ఒంటరితనం గడుపుతున్న వారి జీవితానుభవాల్ని వివరించే విధానాన్ని తీసుకువస్తే కొంతమేర ఫలితాలు ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.



జిల్లా కోర్టులోని ఫ్యామిలీ కోర్టు భవన నిర్మాణ సముదాయం

● 80శాతం యువజంటలవే.....

విడాకుల కోసం కోర్టుకు వెళ్తున్నవారిలో 80 శాతం 25-28 మధ్య వయస్సుల గల జంటలవే. విడాకుల కోసం వీరు చెప్పే కారణాలు కూడా విచిత్రంగా ఉంటాయి. ఇంత చిన్న సమస్యకు విడాకుల వరకు వస్తున్నారా అంటే అది మీకు చిన్నది కావచ్చు మాకు మాత్రం చాలా పెద్దది అంటూ సమాధానం చెబుతున్నారు. ఒకరిపై ఒకరికి విపరీతమైన అంచనాలు, ఊహించుకునే విధంగా వైవాహిక జీవితం లేకపోవడం, ప్రతి మాటకు విపరీత అర్థాలు తీయడం, ఆర్థిక భద్రత ఉండటంతో ఎలాగైన జీవించగలం అనే ధీమా. సర్దిచెప్పేవారు లేకపోవడం, లేనిపోని అపోహలు వంటి కా రణాలు విడాకుల వరకు దారితీస్తున్నాయి. సంసారంలో జరిగే ప్రతి చిన్న సంఘటనను ఇతరులతో పంచుకోవడం ఈ మధ్య అలవాటుగా మారింది. ఇది కూడా దంపతుల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నాయి.

● మూడో వ్యక్తి ప్రమేయమే కారణం

దంపతుల మధ్య జరిగే గొడవల్లో మూడోవ్యక్తి జోక్యం వల్లే పరిస్థితి చేయిదాటుపోతుందని నిపుణులు చెబుతున్నారు. పెళ్లికి ముందు మనకు ఏ సమస్య వచ్చినా స్నేహితులతో పంచుకుంటాం. కాని పెళ్లి తరువాత ఏది స్నేహితులతో చెప్పుకోవాలి...ఏది కుటుంబ సభ్యులతో చెప్పుకోవాలి అనే అవగాహన చాలామందికి ఉండదు. దీంతో మూడోవ్యక్తి సలహాలను పాటించి సమస్యను జటిలం చేసుకుంటున్నారు.

● విడాకుల తరువాత తీవ్ర మనోవేదన

ఇక్కడ ఆసక్తికర విషయమేంటంటే అప్పటివరకు విడిపోవాలనుకున్నా ఒకసారి విడాకులు పొందిన తరువాత దంపతు లిద్దరూ తీవ్రమనోవేధన అనుభవిస్తారు. విడాకుల తీసుకున్న వారి పట్ల సమాజం వ్యవ హరించే తీరు, ఒంటరై పోయామనే భావన, ఇతరులు కుటుంబాలతో సంతోషంగా ఉండటం, పెళ్లైన కొత్తలో సంతోషంగా గడిపిన క్షణాలు గుర్తుకు రావడం వంటి కారణాలతో తీవ్రమానసిక వేదన అనుభవిస్తుంటారు.



సబ్ జూనియర్స్ విభాగంలో
ప్రకాశం జిల్లా ఎడ్లజత ప్రథమం

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా మద్దిరాల మండలం, నాగులుప్పలపాడుకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 2600 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్లజత 1800 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్ బాబు ఎడ్లజత 1683 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. విజేత ఎడ్లజతల యజమానులకు సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, మాజీ ఎంపీపీ ర మావత్ నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, సంగినేటి బాలకృష్ణలు బహుమతులను అందించారు. మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రథమస్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా ఎడ్లజత

శిల్పారామాన్ని సందర్శించిన నూతన సీఈవో, చైర్‌పర్సన్

గుంటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని అడవి తక్కెళ్లపాడు సమీపంలో ఉన్న శిల్పారామంలో సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వీ స్వామినాయుడు, చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు శిల్పారామం కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో మాట్లాడారు. శిల్పారామం మొత్తం కలియతిగిరి స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా అయ్యే విధంగా తగిన ఏర్పాట్లను చేయాలని సూచిం చారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని ఇతర సిబ్బంది ఉన్నారు



శిల్పారామాన్ని సందర్శిస్తున్న స్వామినాయుడు, మంజులారెడ్డి

కృష్ణమ్మకు కార్తీక వెలుగు..

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) కార్తీకమాసం ముగిసిన మరుసటి రోజు పోలి పాడ్యమి పర్వదినం పురస్కరించుకుని వేలాది మంది భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో కృష్ణాతీరం కాంతులీనింది. సోమవారం ఉదయం పోలిస్వర్గం పేరుతో కార్తీకదీపాలను వెలిగించి పవిత్ర కృష్ణానది అలలపై వదిలేందుకు భక్తులు ఆదివారం రాత్రి అమరావతి ఆలయ ప్రాంగణంలోనే బస చేశారు. తెల్లవారు జామునే నిద్రలేచి కృష్ణానదిలో స్నానమాచరించి స్నానఘాట్ వద్ద కార్తీక దీపాలను వెలిగించి అరటి బొదెలపై ఉంచి నదిలో వదిలారు.



కృష్ణమ్మ అలలపై కార్తీక దీపాలను వదులుతున్న భక్తులు

మాఫియా పరేషన్!

(5వ పేజీ తరువాయి)

చీకటి పడిన వెంటనే బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. అందుకోసం మాఫియా ప్రైవేటు వాహనాలు కొనుగోలు చేసి వాటిని ఏరోజుకారోజు తరలించుకుపోతున్నారు. వాటితోపాటు పేదలకు బియ్యాన్ని సరఫరా చేయాల్సిన ఎండీయూ వాహనాల్లోనే కొందరు బియ్యాన్ని మాఫియాకు తరలిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం మాఫియా సిండికేట్ కనుసన్నల్లోనే జరగడం విశేషం.

● బినామీ షాపులతో మాయ

జిల్లాలో చాలా షాపులు రేషన్ మాఫియా కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఉదాహరణకు గుంటూరు నగరంలో వున్న 204 రేషన్ షాపుల్లో 40కి పైగా రేషన్ షాపులు రేషన్ మాఫియా డాన్ అదుపులోనే వున్నాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్ డాన్ వాటిల్లో పెట్టుబడులు పెట్టి పేదల బియ్యం అక్రమ మార్కెట్ మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. షాపుల్లో వచ్చే సరుకు వ్యత్యాసాలను మిగిలిన షాపులతో అనుసంధానం చేసి ఎవరికీ తెలియకుండా బియ్యాన్ని తరలించుకుపోతున్నారు. విధిలేని పరిస్థితిలో దొరికిపోతే 'డాన్' రంగప్రవేశం చేసి చక్కదిద్దుతాడు. ఆరోపణలు వచ్చి డీలర్షిప్పుకు ప్రమాదం వస్తే డీలర్షిప్ బదిలీ బాధ్యత కూడా తీసుకుని తన అనుయాయులకే డీలర్షిప్ వచ్చేలా పావులు కదుపుతూ మాఫియాను ఏకచత్రాధిపత్యంతో నడుపుతున్నారు. ఇలా ఎక్కడికక్కడ మాఫియా సిండికేట్ వ్యవహారాలను చక్కబెట్టి యథేచ్ఛగా పేదల బియ్యాన్ని కొల్లగొడుతోంది.

● మాఫియాకు మిల్లర్ల దన్ను

రేషన్ మాఫియా అక్రమాలకు మిల్లర్లు దన్నుగా నిలుస్తున్నారు. జిల్లాలోని పెద్ద పెద్ద మిల్లర్లందరినీ మాఫియా సిండికేట్లో భాగస్వాములను చేసుకుని వారి మిల్లుల్లోనే బియ్యాన్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఎండీయూ వాహనదారుల దగ్గర, రేషన్ డీలర్ల దగ్గర రూ. 16 నుంచి 21 రూపాయలకు కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లులకు తరలించి, ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యం పేరుతో మార్కెట్లోకి రూ. 55 నుంచి 60 రూపాయలకు చలామణీ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేపట్టిన తనిఖీల్లో 200 టన్నుల రేషన్ బియ్యం రైస్ మిల్లర్ల దగ్గర దొరికింది. రవాణాకు సిద్ధంగా వున్న లారీలను కూడా ఆయన సీజ్ చేశారు. జిల్లాలో రేషన్ మాఫియా ఎంత బలంగా వుందనేది మంత్రి స్వయంగా చేపట్టిన తనిఖీల్లో వెల్లడయింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం పేదల బియ్యం అక్రమాలపై దృష్టి సారించింది.

మిర్చి యార్డులో కలవరం

(5వ పేజీ తరువాయి)

మిర్చియార్డులో పర్సన్ ఇంచార్జిలుగా కొనసాగారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇటువంటి పద్ధతిలో కొనసాగిన అధికారుల నేతృత్వంలో అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వారి పేర్లను కూడా ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసిన ఇద్దరు సెక్రటరీలు భారీ అవినీతికి పాల్పడినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. వారి కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు జరిగినట్లు నిర్ధారించారు. రాజకీయ నేతల అడుగులకు మడుగులొత్తి యార్డు ఆదాయానికి పూర్తిస్థాయిలో గండికొట్టారు. ఈ-నామ్ పోర్టల్ నిర్వహణలోనూ, కటింగ్ వ్యాపారం ప్రోత్సహించటంలోనూ వీరిది కీలక పాత్ర అని తేల్చారు. లైసెన్స్‌ల రెన్యూవల్ వ్యవహారంలో ఒక సెక్రటరీ ఏకపక్షంగా వ్యవహరిచినట్లు తేలింది. మొత్తం 286 లైసెన్స్‌లు ఉండగా, కేవలం 56కు మాత్రమే త్రిసభ్య కమిటీ అనుమతి పొందారు. మిగిలిన వాటికి సెక్రటరీనే రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు మామూళ్లు తీసుకొని రెన్యువల్ చేసినట్లు తెలుస్తోంది. గడచిన ఐదేళ్ల కాలంలో ఇదే సెక్రటరీలను మార్చి మార్చి యార్డు విధుల్లో నియమించారు.

లక్షల క్వింటాళ్ల మిర్చి ఈ-నామ్‌లో పెండింగ్

యార్డులో అవినీతి, అక్రమాలు జరిగేందుకు అన్ని స్థాయిలో సిబ్బంది సహకరించారు. యార్డుకు వచ్చిన మిర్చిని ఈ-నామ్‌లో అప్‌లోడ్ చేయటం, దాన్ని క్లియర్ చేయటంలో మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం వరకు కూడా సుమారు 13 లక్షల క్వింటాళ్ల మిర్చికి సంబంధించి ఈ-నామ్‌లో పెండింగ్ స్టేటస్ చూపించినట్లు విచారణలో తేలింది. ఉద్దేశ పూర్వకంగానే ఇటువంటి పనులు చేసి జీరో, కట్ బిజినెస్‌కు ఇంచార్జీలు, సూపర్‌వైజర్లు సహకరించినట్లు తెలుస్తోంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారులతో చేతులు కలిపిన సిబ్బంది రైతుల ప్రయోజనాల కు కూడా దెబ్బ కొట్టినట్లు నిర్ధారణ అయ్యింది.

ముగిసిన మందపోరు

● వివిధ జిల్లాల హాజరైన వీరారాచవంతులు
● కొణతాలకు నాగులేటిలో స్నానాలు.. ఊరేగింపు
● అంకాళమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు
● నేడు ప్రధాన ఘట్టం 'కోడిపోరు'

మండల కేంద్రమైన కారంపూడిలో నిర్వహిస్తున్న పల్నాడు వీరారాధన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం మందపోరు నిర్వహించారు. ఆవుల మందకు కాపలాగా ఉన్న గోపన్నను నాగమ్మ సైన్యం హతమార్చిన సంఘటన గురించి గానం రూపంలో ఆలపించారు. పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులకు కంకణదారణ చేశారు. మందపోరు ఘట్టాన్ని విజయవంతంగా ముగించారు. ఉత్సవాల్లో ప్రధానమైన కోడిపోరు ఘట్టాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.

కారంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ముందుగా వచ్చిన వీరాచార వంతులు తమ కొణతములకు నాగులేటిలోని గంగధారమడుగులో స్నానమాచరింపజేసి అలంకరించారు. వీర్ల దేవాలయంలో పూజలు నిర్వహించి పొంగళ్లను నైవేద్యంగా పెట్టారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి చెన్నకేశవ స్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. బ్రహ్మనాయుడు విగ్రహం, పీఠాధిపతి నివాసం వద్ద కత్తిసేవ చేశారు. మహిళా వీరాచారవంతులు అంకమ్మ పెట్టెలతో అమ్మవారికి సంబంధించిన వస్తువులు, గాజులు, ఫోటో, కుంకుమ తదితర సామగ్రితో తరలివచ్చారు. అందరూ ఊరేగింపుగా అంకాళమ్మ ఆలయానికి పూర్వీకుల ఆయుధాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాళమ్మ అమ్మవారికి కొలుపులు చేశారు. రాత్రివేళ పీఠాధిపతి తరుణ్‌చెన్నకేశవ అయ్యవారును ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా వీర్ల దేవాలయం వద్దకు తీసుకొని వచ్చారు. అక్కడ రాచగావు మండపంలో బ్రహ్మనా యుడు స్థానంలో పీఠాధిపతి ఆశీనులు కాగా వీరవి ద్యావంతులు మందపోరు కథను గానం చేశారు.

కులమతాలకు అతీతంగా చాపకూడు

● పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టరు, ఎస్పీ

బ్రహ్మనాయుడు ఆశించిన సర్వమత సమ్మేళనంలో భాగంగా వీరారాధన ఉత్సవాల్లో మూడో రోజున మందపోరులో భాగంగా వీర్ల దేవాలయ ఆవరణలో చాపకూడు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహపంక్తి భోజనం చేశారు. 900 యేళ్ల క్రితమే కుల మతాలకు అతీతంగా చాపకూడును పల్నాటి బ్రహ్మనాయుడు నిర్వహించారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు హాజరై సహపంక్తి భోజనం చేశారు. వీరుల దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మనాయుడు నృసింహకుంతాన్ని చేబూనారు. ముందుగా ఉత్సవాలకు విచ్చేసిన ప్రజాప్రతినిధులకు కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికి ర్యాలీ జరిపారు. పంగులూరి అంజయ్య, పుల్లయ్య, కుర్రి శివారెడ్డి, బొల్నేడి శ్రీను, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, గోరంట్ల నాగేశ్వరరావు, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కర్లా సైదారావు, మోదీన్‌సా, బూసా రామాంజినేయులు, గోళ్ల సురేష్ యాదవ్, ఎస్‌పీఆర్ కృష్ణ, శంకర్, పూర్ల, రాఘవ, షేక్ జానీబాషా, షేక్ నన్నేసా, తుపాకుల రత్తయ్య, బొల్నేడి హరికృష్ణ, కిలారి పవన్, కూటమి నేతలు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మరెడ్డి, అరవిందబాబు, వెంకట్రావు, కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన మంగళవారం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కోడిపోరును నిర్వహించనున్నారు. పల్నాటి యుద్ధానికి ప్రధాన కారణమైన కోడి పందెలను కోడిపోరు పేరుతో వీర్ల దేవాలయ ప్రాంగణంలో జరపనున్నారు. ఈ పోరును వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు.



మందపోరును గానం చేస్తున్న వీరవిద్యావంతుడు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ములకలూరు డీలర్‌పై కేసు నమోదు

నరసరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరులో షాపు నెంబరు 88లో డీటీ ఎస్.ప్రభాకర్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. డీలర్ వద్ద ఉండాల్సిన నిల్వలు కన్నా అధికంగా 15.77 క్వింటాళ్ల బియ్యం నిల్వలను గుర్తించారు. ఈ సందర్భంగా డీలర్ మహబూబీపై 6(ఏ) కింద కేసు నమోదు చేశారు. అధికంగా ఉన్న బియ్యం నిల్వలను సీజ్ చేశారు. బియ్యం పంపిణీ చేయకుండానే ఈ-పోస్‌లో నమోదు చేయడం వలనే అధికంగా డీలర్ వద్ద నిల్వలు ఉన్నట్టు నిర్ధారించారు.


ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వర స్వామి

ఘనంగా భీమలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

నరసరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాతూరు శివాలయంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం ఘనంగా జరిగింది. తొలుత స్వామికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ఏకాహం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. అన్నాభిషేకం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నిలిచిన జల జీవన్ మిషన్ పనులు

రొంపిచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో జల జీవన్ మిషన్ పనులు నిలిచిపోయాయి. మొదటి విడత పనులను గతంలో నిర్వహించారు. రూ.4.30కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టారు. ఐతే ఈ నిధులతో చెరువు నిర్మాణం, దేవుడుమాన్యం కాలనీలోకి నీటి సరఫరా ఏర్పాటుచేశారు. ఐతే గ్రామంలో పనులు చేయటానికి రెండో విడత నిధులు మంజూరు కాలేదు. దీంతో గ్రామంలో తాగు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయరెడ్డిని వివరణ కోరగా రూ.3.67కోట్ల నిధులతో టెండర్ పిలవాల్సి ఉందని తెలిపారు. టెండరు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

చేపలచెరువు వేలం వాయిదా

శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్రువారిపాలెం లోని సుబ్బరాజు చెరువులో చేపల పెంపకానికి సోమవారం నిర్వహించిన వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వాయిదా పడ్డట్లు ఈవోపీఆర్డీ సుగుణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ గతంలో నిర్వహించిన వేలంను ఏడాదికి రూ.5లక్షలకు గుత్తేదారులు దక్కించుకోగా ఈ ఏడాది రెండు పసలీలకు రూ.5.50లక్షలకు అప్‌సెట్ ధరతో పాటను నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదన్నారు. వేలంను తిరిగి నిర్వహించేందుకు త్వరలో తేదీని నిర్ణయించి ప్రకటిస్తామని తెలిపారు.

విద్యుత్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ (సీఐటీయూ అనుబంధ సంస్థ) యూనియన్ కార్మికులు సోమవారం స్థానిక విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జల్లెడ రాజశేఖర్, సీఐటీయూ నాయకుడు పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల ఐదు సంవత్సరాల ఆర్జిత సెలవుల బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దు: మారుతి వరప్రసాద్

నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు అమర్చవద్దని, కరెంట్ చార్జీల పెంపుదల విరమించుకోవాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సీపీఐ కార్యాలయంలో సీపీఐ పల్నాడు జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏ మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అక్రమ లావాదేవీలతో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఒప్పందాలు చేసుకోగా నాడు వామపక్షాలు, నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూడా వ్యతిరేకించాయన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, కాసా రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 59మంది స్పీకింగ్ ట్రీ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కళాశాలలో స్పీకింగ్ ట్రీ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 147మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి 2.50లక్షలు వేతనంగా అందజేస్తారన్నారు.

పింఛన్ల నిలిపివేతపై ఆందోళన

శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన 11మంది లబ్ధిదారులకు నవంబరు నెలకు అందించాల్సిన సామాజిక పింఛన్లను తొలగించారంటూ మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావుతో కలిసి బాధితులు శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి నిలిపివేసిన ఫించన్‌లు పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై ఎంపీడీవో సీతారామయ్యను వివరణ కోరగా నకిలీ సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఫించన్లు నిలుపుదల చేశామని, ఆధారాలు పునఃపరిశీలన పింఛన్లను పునరుద్ధరిస్తామన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

అభివృద్ధి పనుల శంకుస్థాపనలో వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు


సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతా పచ్చదనం, పరిశుభ్రత సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మార్కాపురం రోడ్డులోని 15వ వార్డులో సుమారు రూ.13.71లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణం, పల్లెల్లో పెద్దఎత్తున సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతోపాటు వ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. గతంలో చెత్తమీద పన్నువేసిన వైసీపీ ప్రభుత్వం వేలకోట్ల టన్నుల చెత్తను ఎక్కడబడితే అక్కడ పడవేసిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా శుభ్రమైన పాలన అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. వినుకొండలో ఎక్కడ చెత్త, మురుగు కనపించకుండా, చెత్త కనిపిస్తే తీసుకువెళ్ళి సంపద సృష్టించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వినుకొండ నియోజకవర్గంలోని ఎస్టీ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాల కోసం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.2కోట్లు నిధులు ఇచ్చారన్నారు. పట్టణం అంతా పారిశుధ్య పనులు చేయిస్తున్న కమిషనర్‌ను అభినందించారు. త్వరలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పూర్తిచేస్తామని, ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో ఒక పార్కు, స్టేడియం, షాదీఖానా, ఎస్సీ భవన్ ఏర్పాటుచేస్తావన్నారు. వినుకొండలో మొక్కలు పెంచడం పరిశుభ్రంగా ఉంచడాన్ని ఉద్యమంలా చేపట్టాలని, గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, 17500 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 10వేల కిలోమీటర్ల సీసీ డ్రెయిన్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లడుతూ గత మా ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమయ్యాయని, తమకు తెలియకుండానే నిధులను పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వార్డుల్లో కుంటుపడిన అభివృద్ధికి ఎమ్మెల్యే జీవీ బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీ సురేష్, జనసేన ఉమ్మడి జిల్లాల కార్యదర్శి నిశంకర శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సౌదాగర్‌జానిబాషా, రియల్ ఎస్టేట్ జాని, సుభాని, పఠాన్, చికెన్‌బాబు, గంధం సుబ్బారావు, అరుసుమల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించండి

ఎస్పీ కంచి శ్రీనివాసరావు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువు లోగా పరిష్కరించడానికి కృషి చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సంబంధిత పోలీసు అధికారులకు సోమవారం ఆదేశాలు జారీచేశారు. ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఆయన పాల్గొని ప్రజల వద్ద నుంచి వివిధ అంశాలకు సంబంధించిన 66 ఫిర్యాదులను స్వీకరించారు. పట్టణంలో తన రెండో కుమారుడు జులాయిగా తిరుగుతూ ఇంట్లో వస్తువులు తాకట్టు పెడుతూ, ప్రస్తుతం ఉంటున్న ఇల్లు కూడా రాసి ఇవ్వమని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పొదిలి పట్టణం నవాబుకట్టకు చెందిన ముల్లా కాలేశా వలి సంగీత్ మొబైల్ స్టోర్ ఏరియా సేల్స్ మేనేజర్‌గా సంవత్సరం నుంచి పనిచేస్తున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని సంగీత్ మొబైల్‌లో చేస్తూ కూడా అతని పరిధిలో చెకింగ్‌లో భాగంగా నాలుగు నెలలు క్రితం 1,60,000 స్టోర్ మేనేజర్ మహేష్ తన సొంత ఖర్చులకు వాడుకున్నాడని ఈ మేరకు నేరం అంగీకరించాడని డబ్బులు ఇస్తానని తప్పించుకు తిరుగుతున్నాడని ఫిర్యాదు చేశారు. వినుకొండ పట్టణం చెందిన వరికుంట కృష్ణ తన తమ్ముడి ద్వారా పరిచయం అయిన అక్షయ ప్యాలెస్‌ను నడుపుతున్న జీ శ్రీనివాసరావుకు, వ్యాపార అవసరం ఐదేళ్ల క్రితం రూ.తొమ్మిది లక్షల 50వేలు ఇచ్చామని, వాటిని ఇప్పటివరకు ఇవ్వకుండా మోసం చేశారని న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సాయమందించారు.

ఘనంగా పోలిస్వర్గం పూజలు


సాయిబాబా దేవాలయంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన పోలిస్వర్గం

వినుకొండ టౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరిరోజు మహిళలు తెల్లవారుజాము నుంచి పోలిస్వర్గం పూజల్లో భాగంగా పలు దేవాలయాల్లో, ఎన్ఎస్‌పీ కాల్వ వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వినుకొండ పట్టణ నడిబొడ్డున ఉన్న ఎన్ఎస్‌పీ కాల్వ ఉధృతంగా ప్రవహించడంతో మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని పారేనీటిలో దీపాలు వెలిగించి నీటిలోకి వదిలారు. అదేవిధంగా అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయం తోపాటు బోసుబొమ్మ సెంటర్‌లోని షిరిడిసాయిబాబా దేవస్థాన ఆవరణలో మాసశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున 5గంటల నుంచి పోలి స్వర్గం కోనేరులో మహిళలు దీపాలు వెలిగించారు. సురేష్ మహల్ రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద తాత్కాలికంగా ఏర్పాటుచేసిన పోలి స్వర్గంలో మహిళలు పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పలు దేవాలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. దేవాలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మనిషికి ఆథ్యాత్మిక జ్ఞానం పెరిగినప్పుడు శాంతి, సంతోషం లభిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. కొత్తపేటలోని శ్రీమహాగణపతి దేవాలయం వద్ద కౌన్సిలర్ గంధం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన పోలి స్వర్గం పూజలో ప్రభుత్వ చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వ్యాసమహర్షి రాసిన స్కంద పురాణం ప్రకారం కార్తీకమాసం చివరిరోజు అమావాస్య తర్వాత తిథిని పోలిపాడ్యమిగా జరుపుకుంటారన్నారు. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన తాత్కాలిక కొలనులో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దీపం వెలిగించి వేద ఆశీర్వచనాలు పొందారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీవీ సురేష్‌బాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం అయిపోయిన తరువాత పోలి స్వర్గం పూజలు నిర్వహించటం ఆనవాయితీ. సోమవారం తెల్లవారుజామున భక్తులు అరటి డొప్పల్లో దీపాలను వెలిగించి నీటిలో వదిలిపెట్టారు. కార్తీక మాసం పూజల అనంతరం దీపాలను వెలిగిస్తారు. భక్తులు కాలువల వద్ద ఈ దీపాలను వదిలి పెట్టి, ఆకాశంలో ఉన్న నక్షత్రాలకు నమస్కరించి పూజలు చేశారు.


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణబాబు, ఇతర అధికారులు

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పిర్యాదు పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లావ్యాప్తంగా వచ్చిన 39మంది అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూల నుంచి అర్జీదారులు వస్తుంటారన్నారు. ఇటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్నాడు జిల్లా సెమీ క్రిస్మస్

చిలకలూరిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ పల్నాడు జిల్లా సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో పాస్టర్లు తరలివచ్చారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు బ్రదర్ నందమూరి క్రిష్టర్ ఆధ్వర్యములో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ ప్రతాప్ సింహ, కార్యదర్శి బిషప్ డేనియల్ పాల్, గుంటూరు జోనల్ చైర్మన్ రెవ విక్రాంత్ వర్ధన్, పల్నాడు జిల్లా సలహాదారులు రెవ సుధీర్ కుమార్, పల్నాడు జనరల్ సెక్రెటరీ బిషప్ జె జయరావు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అడ్మినిస్ట్రేటర్ బ్రదర్ జె చక్రవర్తి, జిల్లా ట్రెజరర్ బ్రదర్ టి రత్నకుమార్ పర్యవేక్షించారు.

కారుమంచిలో డయాలసిస్ పింఛన్ అందజేత

కారుమంచి (శావల్యాపురం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సామాజిక పింఛన్ల పెంపు హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలబెట్టుకొని పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కారుమంచిలో డయాలసిస్‌తో బాధపడుతున్న మల్లాపరవు బుల్లెయ్యకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల పింఛను కూటమి నాయకుల చేతులమీదుగా సోమవారం అందజేశారు. ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు పరిపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ మల్లాపరపు గాలెయ్య, మాజీ సర్పంచ్ మల్లాపరపు ఏసయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ శిరీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్లలోని నవభారత్ స్కూలు వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేట మండలం యలమందల గ్రామానికి చెందిన సకిల సాకేతిరెడ్డి (21) తీవ్ర గాయాలు అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మోటారు సైకిల్‌పై ఉన్న ప్రసాదరెడ్డికి, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

సైనికుల నిధికి విరాళాలను ఇవ్వండి: కలెక్టర్

నరసరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక నిధికి అన్నివర్గాల ప్రజలు ఉదారంగా, విరివిగా విరాళాలు అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ అరుణ్‌బాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, పోస్టర్స్ కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్, డీఆర్వో, పలువురు జిల్లా అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు సాయుధ దళాలలో పనిచేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి మాజీ సైనికుల పునరావాస కార్యక్రమంలో అమరులైన వీర జవాన్లకు, వితంతువులకు వారి కుటుంబ సభ్యులకు ఆదుకునే క్రమంలో ఉదారంగా ప్రజలు విరాళాలు అందించాలని కోరారు. మన దేశ సాయుధ దళాలు యుద్ధ సమయంలోను, శాంతి సమయంలోను దృఢ సంకల్పం, ఏకాగ్రతతో దేశసేవ చేస్తున్నారని, మాతృదేశం కొరకు అసువులు బాసిన వీర సైనికులు వారి వితంతువులు, కుటుంబ సభ్యులపై దేశ ప్రజల బాధ్యతను ఈ పతాక దినోత్సవం గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా దేశంలో ఆయా ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్యా సంభవించే వరదలు, భూకంపాలు, తుఫానులు వాటిలినప్పుడు మరణానికి సైతం వెనకాడకుండా సైనిక దళాలు చేపట్టిన సహాయ కార్యక్రమాలు దేశప్రజల మన్ననలను, అభిమానాన్ని చూరగొంటున్నాయని తెలిపారు. సైనిక దళాలు చేస్తున్న సేవలు అభినందనీయం, చిరస్మరణీయన్నారు.

పేరయ్య సేవలు మరువలేనివి: చీఫ్ విప్ జీవీ


పేరయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేరయ్య సేవలు మరువలేనివి అని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఇనుమెళ్ళలో సోమవారం మాజీ ఉపసర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు శాఖమూరి పేరయ్య దశదిశ కర్మ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటుచేసిన పేరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం పేరయ్య ఎంతో కృషి చేశాడన్నారు. అదే సమయంలో గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేశాడన్నారు. ముందుగా పేరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, శాఖమూరి రామ్మూర్తి, శాఖమూరి అర్జునరావు, కాటం కోటేశ్వరరావు, రామాంజినేయులు, బొల్లా వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పశుగణనతో పారదర్శకంగా పథకాల పంపిణీ

● వేల్పూరు సెక్టార్ పశు వైద్యాధికారి గణేష్‌కుమార్





శావల్యాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా పంపిణీ చేసేందుకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శావల్యాపురం మండలం వేల్పూరు సెక్టార్ పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ తెలిపారు. పశుసంవర్ధకశాఖ ద్వారా పశుపోషకులకు అందిస్తున్న సేవలను ఆయన ఆంధ్రజ్యోతికి సోమవారం వివరించారు.

ప్రశ్న: పశుగణన ఎన్నేళ్లకు ఒకసారి జరుగుతుంది?

జ: పశుగణనను ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహిస్తాం. పశుగణనలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు తదితర పశువులన్నీ లెక్కిస్తారు.

ప్రశ్న: పశుగణన వల్ల ప్రయోజనాలు ఏమిటి ?

జ: దేశవ్యాప్తంగా ఎన్ని పశువులు ఉన్నాయో లెక్కించడం ద్వారా పశుపోషకులకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీపై అందించే దాణా, పశుగ్రాసం, వైద్యసేవలు, మందులు, ఇతర సేవలు అందించడానికి సులభతరమవుతుంది. దీంతో అర్హత ఉన్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు, రాయితీలు పారదర్శకంగా అందుతాయి.

ప్రశ్న: పశుగణన కార్యక్రమం ఎప్పటివరకు జరుగుతుంది?

జ: పశుగణన కార్యక్రమంలో ఫిబ్రవరి 29వరకు జరుగుతుంది. ఈలోపు నూరు శాతం పశుగణను పూర్తి చేసేందుకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ప్రశ్న: పశుపోషకులకు ప్రస్తుతం ఏమేమి రాయితీలు అందిస్తున్నారు ?

జ: పశుపోషకులకు ఆరు నెలలుగా రాయితీలపై దాణాలు, పశుగ్రాసం ఇవ్వడం లేదు. త్వరలో రాయితీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.

ప్రశ్న: నట్టల నివారణకు తీసుకొంటున్న జాగ్రత్తలు ఏమిటి ?

జ: గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నట్టల నివారణ మందులను ఇచ్చారు. నట్టల నివారణ మందులతో గొర్రెలు, మేకల కడుపులోని క్రిమికీటకాలు చనిపోయి ఆరోగ్యంతో పాటు ఎదుగుదల సమస్య లేకుండా పోతుంది.

ప్రశ్న: చలికాలంలో పశువులకు తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి ?

జ: చలికాలంలో పశువులను ఆరుబయట కట్టేయరాదు. మంచుపడకుండా ఉండేలా పైకప్పు ఉన్నచోట కట్టేయాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వేయాలి. సకాలంలో నూడి పరీక్షలు చేయించాలి. పశువులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అశ్రద్ధ చేయకుండా సకాలంలో వైద్యపరీక్షలు చేయించి మందులను వాడాలి.

మతిస్థిమితం లేని యువకుడి అప్పగింత

● పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు


మతిస్థిమితంలేని యువకుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్


కేశానుపల్లి (నరసరావుపేట రూరల్), డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నరసరావుపేట రూరల్ పోలీసులు మతిస్థిమితం లేని యువకుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన సోమవారం జరిగింది. ఎస్ఐ కిషోర్ మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి కాలనీలో ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా సుమారు 22 సంవత్సరాలు వయసు కలిగిన మతిస్థిమితం లేని వ్యక్తి కనిపించగా ప్రశ్నించారు. సరైన అడ్రస్ చెప్పలేని పరిస్థితిలో, అతని భాషను అర్థం చేసుకొని ఆ వ్యక్తి తమిళనాడుకు చెందిన వ్యక్తిగా తెలుసుకుని ఇంకా ప్రశ్నించగా కుటుంబ సభ్యుల ఫోన్ నెంబరు కాగితంపై రాశాడు. ఆ నెంబరుకు ఫోన్ చేసి ప్రశ్నించగా తమిళనాడు తిరువల్లూరు జిల్లా పాకం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, తల్లిదండ్రులైన లోకనాథం తిరువల్లూరు హాస్పిటల్ నుంచి 20రోజుల క్రితం తీసుకొని వెళ్ళగా తప్పిపోయాడని తెలిపారు. ఆ యువకుడికి భోజనం ఏర్పాటుచేసి నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. సోమవారం మధ్యాహ్ననికి తల్లిదండ్రులు నరసరావుపేట రాగా వారికి ఆ యువకుడిని అప్పగించారు. ఈ సందర్భంగా నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కిషోర్‌కు యువకుడి తల్లిదండ్రులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

● ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

లింగంగుంట్ల (నరసరావుపేట రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ఆరు నెలల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు కోట్ల రూపాయలలో పేరుకుపోయాయని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పనిభారంగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరో ముఖ్య అతిథి పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. సాంబశివరావు, ఎం ఎస్ రావు లు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సంస్కరణలు విద్యార్థుల విద్యా భివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడవన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్యదర్శి హరియా నాయక్ మాట్లాడుతూ ప్రతి రోజు 62 యాప్స్‌తో పాఠశాల తరగతుల ప్రారంభంలో మొదటి పీరియడ్ మొత్తం బోధన లేకుండా పోయిందని వెంటనే అనవసర యాప్స్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గద్దె రామకోటేశ్వరరావు, ఊటుకూరి. శ్రీకృష్ణ, జాకీర్ హుస్సేన్, చేపూరి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతి పాల్గొన్నారు.

అనుమతులు లేని తవ్వకాలపై ఫిర్యాదు


ఐనవోలు - భూమాయపాలెం మార్గంలో తవ్విన కాలువ

నూజెండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలు నుంచి భూమాయపాలెం మార్గంలో రోడ్డు పక్కన అనుమతులు లేకుండా ఫైబర్ కేబులు వేసేందుకు కాలవ తవ్వకంపై పీఆర్‌యూ అధికారులు ఐనవోలు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గుండ్లకమ్మ స్టేషన్ నుంచి భూమాయపాలెం వరకు సుమారు 7.5 కిలోమీటర్లు రోడ్డు మార్జిన్‌లలో కాలువలా తవ్వి మట్టిని రోడ్డుపై వేయటం వల్ల తమకు ఇబ్బందిగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓఎఫ్‌సీ కేబుల్ వేస్తున్న కంపెనీ వారు పీఆర్‌యూ నరసరావుపేట అధికారులకు దరఖాస్తు మాత్రమే చేసుకున్నారని, అనుమతులు మంజూరు చేయకుండానే పనులు ప్రారంభించటంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినా కంపెనీ ఉద్యోగులు లక్ష్యపెట్టక పోవటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

నూజెండ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవ్వవరం కొండ సమీపంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న పేకాట స్థావరంపై రూరల్ సీఐ టీ ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తొమ్మిది సెల్ ఫోన్‌లు, ఎనిమిది ద్విచక్ర వాహనాలను, రూ.1,03,500 స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



రక్తపోటు అదుపులో

రక్తపోటును అదుపులో ఉంచుకోవటం కోసం ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను అనుసరించటం, జీవన శైలి మార్పులు, మందులు, వ్యాయామం... ఇలా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటాం. అయితే తీసుకునే ఆహారం కూడా రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. అలాంటి ఆహారంలో 'అరటి పండు' ఒకటి.

రక్తపోటు ఉన్నవాళ్లకు వైద్యులు అరటి పండు తినమని సూచిస్తూ ఉంటారు. కానీ నిజానికి అరటి పండుకు అంత శక్తి ఉందా? అనే అనుమానం అందరికీ వస్తుంది. అయితే అరటిపండు మన శరీరం మీద చూపించే ప్రభావం గురించి తెలుసుకునే ముందు మూత్రపిండాల పనితీరు గురించి తెలుసుకోవాలి. మూత్రపిండాలు మన శరీరంలోని ద్రవాలను వడపోస్తూ అదనంగా ఉన్న ద్రవాల్ని విసర్జించేలా చేస్తూ శరీరంలో నీటి శాతాన్ని సమంగా ఉంచుతూ ఉంటాయి. ఈ విధానం అంతా మన రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. శరీరంలో

చిట్కా



ఎక్కువ ద్రవాలు నిల్వ ఉండిపోతే రక్తపోటు పెరిగిపోతుంది, తక్కువ ఉంటే రక్తపోటు పడిపోతుంది. ఈ రెండూ ప్రమాదమే! ఇలా శరీరంలోని ద్రవ పరిమాణం హెచ్చుతగ్గులకు గురికాకుండా మూత్రపిండాలు సోడియం, పొటాషియం అనే రసాయనాల మధ్య సమతూకాన్ని పాటిస్తాయి. పొటాషియం ఎక్కువగా నీటిని మూత్రపిండాల్లోకి చేరవేస్తే, సోడియం నీటిని మూత్రపిండాల్లోకి చేరకుండా నియంత్రిస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకునే ఉప్పు వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండిపోయి రక్తపోటు పెరిగిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే అలా నిల్వ ఉన్న నీటిని మూత్రపిండాల్లోకి చేరవేసే పొటాషియం ఉన్న ఆహారం తీసుకోవాలి. ఒక అరటి పండులో 422 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. మనకు ఒక రోజుకి అవసరమైన 4,700 మిల్లీగ్రాముల్లో ఇది పది శాతానికి సమానం. కాబట్టి రక్తపోటు ఉన్నవారు రోజుకో అరటిపండు తినటం మేలని వైద్యులు సూచిస్తూ ఉంటారు.

అవగాహన

మూత్రపిండాలు ఇలా క్షేమం

శరీరంలో ఏ కారణంగా వ్యర్థాలు పేరుకుపోయినా వాటి దుష్ప్రభావం ముందు కిడ్నీల పైన పడుతుంది. అందుకే కిడ్నీలు సక్రమంగా పనిచేయాలంటే, శరీరంలోని అన్ని అవయవాలూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. అందుకు ఒక్కో అవయవానికీ శక్తినిచ్చే సహజ సిద్ధమైన కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు తీసుకోవాలి. అలాంటి ఆహార పదార్థాల్లో కొన్ని...

- **నిమ్మ:** అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండే వాటిల్లో నిమ్మకాయ ఒకటి. ఎక్కువ మంది అందులోని విశేషాలను పెద్దగా పరగణనలోకి తీసుకోరు. నిజానికి, శరీరంలోని కలుషితాలను బయటికి పంపడంలో నిమ్మకాయ అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ పరగడుపున ఒక నిమ్మకాయ రసాన్ని, నీళ్లలో కలిపి తాగితే శరీరంలోని మలినాలన్నీ తొలగిపోతాయి. శరీర బరువును తగ్గించడం నిమ్మ కలిగి ఉండే మరొక గొప్ప గుణం.



- **యాపిల్:** దీనిలో విటమిన్లు, లవణాలు, పీచుపదార్థం ఎలాగూ ఉంటాయి. వీటితో పాటు యాపిల్‌లో ఉండే ఫైటో కెమికల్స్ శరీర వ్యర్థాలను చాలా వేగంగా బయటికి పంపిస్తాయి. విటమిన్- సి చర్మాన్ని కూడా ఆరోగ్యంగా మారుస్తుంది.
- **బెర్రీ పండ్లు:** స్ట్రాబెర్రీ, బ్లాక్ బెర్రీ, బ్లూ బెర్రీ... ఈ జాతి పండ్లన్నింటిలోనూ సి విటమిన్, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఈ పండ్లలో ఉండే ఫ్యాటీ యాసిడ్ శరీరం బరువును అదుపులో ఉంచుతుంది.
- **పైనాపిల్:** ఈ పండుతో కీళ్ల సమస్యల వల్ల వచ్చే వాపు తగ్గడంతో పాటు, గాయాలు కూడా త్వరగా మానతాయి.

సమతులాహారం, వ్యాయామం, టీకాలు ఇవే కాలేయానికి ప్రాణ స్నేహితులు. వీటి మీద దృష్టి పెడితే కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీ లివర్, లివర్ క్యాన్సర్ లాంటి శత్రువులు దరి చేరకుండా ఉంటాయంటున్నారు వైద్యులు.



కాలేయం క్షేమంగా...

కామెర్లు సోకితే పత్యంతో సరిపెట్టేసుకుంటాం. నోరూరించే బర్గర్లు ఆబగా లాగించేస్తూ ఉంటాం. పెరిగే బరువును నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. మద్యపానాన్ని సరదా కాలక్షేపంగా పరిగణిస్తూ ఉంటాం. కానీ జీవనశైలితో ముడిపడి ఉండే ఈ అంశాలన్నీ కాలేయాన్ని క్రమేపీ కుదేలు చేస్తాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

పొంచి ఉండే హెపటైటిస్

కాలేయం దెబ్బతినడానికి మద్యపానం, ఫ్యాటీ లివర్ డిసీజ్, హెపటైటిస్ 'బి', హెపటైటిస్ 'సి'లు ప్రధాన కారణాలు. నిజానికి వీటన్నిటినీ నియంత్రించుకునే మార్గాలున్నాయి. పదేళ్ల క్రితం హెపటైటిస్ 'సి' ప్రాణాంతకమైన వ్యాధిగా ఉండేది. ఈ వ్యాధితో కాలేయం బాగా దెబ్బతిని, క్యాన్సర్‌కు గురై, కాలేయ మార్పిడి చేసినా మళ్లీ హెపటైటిస్‌తో పూర్తిగా కోలుకోలేనంతగా దెబ్బతినే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు అందుబాటులో ఉన్నంత సమర్థమైన చికిత్సలు అప్పట్లో లేవు. కాబట్టి మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు ఎన్నో అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 95 శాతానికి పైగా హెపటైటిస్ వ్యాధిని వైద్యులు సమూలంగా నయం చేయగలుగుతున్నారు. దాంతో ఈ ప్రాణాంతకమైన తీవ్ర వ్యాధి, చికిత్సకు లొంగే సాధారణ రుగ్మతగా మారిపోయింది. అయితే ఈ రుగ్మతను ఎంత సమర్థంగా నిలువరించగలిగినా, రుగ్మతలో భాగంగా కాలేయంలో కణుతులు పెరగకుండా నియంత్రించలేని పరిస్థితి. కాబట్టి ఈ రుగ్మత నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా వైద్యులను కలుస్తూ క్రమం తప్పకుండా కాలేయాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

కాలేయ కొవ్వుతో ముప్పు

ఇప్పటికి పదేళ్ల క్రితం, వంద కాలేయ మార్పిడి చికిత్సల్లో 10 నుంచి 15 కాలేయ మార్పిడులు ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు సంబంధించినవే అయి ఉండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య 40 నుంచి 50కి పెరిగిపోయేలా ఫ్యాటీ లివర్ డిసీజ్ అత్యంత సాధారణ కాలేయ సమస్యగా మారిపోయింది. అలాగే ఫ్యాటీ లివర్ డిసీజ్ మూలంగా కాలేయ మార్పిడి అవసరమయ్యే తీవ్ర కాలేయ సమస్యల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. మన జీవనశైలే ఈ సమస్యకు ప్రధాన కారణం. పాశ్చాత్య ఆహారపుటలవాట్లు, అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, అస్తవ్యస్థ జీవనశైలి, వ్యాయామం లోపించడం, అధిక బరువు... ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు కారణాలే! స్థూలకాయంతో మధుమేహం, అధిక రక్తపోటు, ఈ రెండింటితో కాలేయ కొవ్వు సమస్యలు పెరుగుతాయి. అందుకే తాజాగా ఈ కాలేయ సమస్యను 'మెటబాలిక్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్' అంటున్నారు. స్థూలకాయ సంబంధిత ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ఆధునిక మందులు కూడా రెండేళ్లుగా అందుబాటులోకొచ్చాయి. ఈ మందులతో బరువు తగ్గడంతో పాటు ఫ్యాటీ లివర్ పరిస్థితి కూడా కొంత మెరుగుపడుతుంది. అయితే ఈ మందులతోనే ఆరోగ్యం పూర్తిగా కుదుట పడుతుందనుకుంటే పొరపాటు. వీటిని వాడుకుంటూ అదనంగా ఆహారపుటలవాట్లను పాటిస్తూ, వ్యాయామం కూడా కొనసాగించవలసి ఉంటుంది. అప్పుడే సత్ఫలితాలను సాధించడం సాధ్యపడుతుంది.

ఓ కన్నేసి ఉంచి...

హెపటైటిస్, ఫ్యాటీ లివర్ వల్ల దెబ్బతిన్న కాలేయం తేలికగా క్యాన్సర్ బారిన పడుతుంది. ప్రతి వంద మంది కాలేయ క్యాన్సర్ రోగుల్లో, 80 మంది అప్పటికే కాలేయ జబ్బులతో బాధపడుతూ ఉంటారు. కాబట్టి కాలేయ జబ్బులతో బాధపడేవాళ్లు క్రమం తప్పకుండా కాలేయ పరీక్షలు చేసుకుంటూ, మందులు వాడుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో నడుచుకుంటూ ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి రక్తపరీక్షలు, ప్రతి ఆరు నెలలకోసారి అల్ట్రాసౌండ్ స్కాన్ చేయించుకుంటూ ఉండాలి. పొట్ట, పిత్తాశయ క్యాన్సర్లలో సర్జరీతో క్యాన్సర్ నయమయ్యే అవకాశాలు 30 నుంచి 40 శాతం మేరకే ఉంటాయి. కానీ కాలేయ క్యాన్సర్‌లో... కాలేయ మార్పిడి చేయగలిగితే వ్యాధి నయమయ్యే అవకాశాలు 80 శాతం మేరకు ఉంటాయి. కాబట్టి కాలేయ క్యాన్సర్‌కు కాలేయ మార్పిడే ఉత్తమమైన ప్రత్యామ్నాయం.

పసికందుల్లో కామెర్లు

అప్పుడే పుట్టిన పసికందుల్లో కామెర్లు సహజమే! అయితే ఈ సమస్య వారం రోజుల్లో తగ్గిపోవాలి. రెండు వారాలకు కూడా తగ్గకపోతే, ఆలస్యం చేయకుండా పిల్లల వైద్యులకు చూపించాలి. ప్రస్తుతం 'బిలేరీ అట్రేసియా' అనే కాలేయ సమస్య పసికందుల్లో కాలేయ మార్పిడిలకు కారణమవుతోంది. ఈ సమస్యను సకాలంలో గుర్తించాలంటే పసికందుల్లో కొన్ని లక్షణాలను గమనించాలి. రెండు వారాలకు మించి కామెర్లు తగ్గకపోవడం, మలం లేత రంగులో ఉండడం ఈ సమస్య ప్రధాన లక్షణాలు.

ఇమ్యునోథెరపీతో...

కాలేయ క్యాన్సర్‌లో లక్షణాలు తక్కువ కాబట్టి వ్యాధి ఆలస్యంగా బయటపడుతూ ఉంటుంది. అలాగని చివరి దశకు చేరుకున్న కాలేయ క్యాన్సర్‌ను నయం చేయడం సాధ్యపడదని అనుకోడానికి వీల్లేదు. మొదటి దశ అయినా, చివరి దశ అయినా కాలేయ క్యాన్సర్‌కు ఉత్తమమైన ప్రత్యామ్నాయం కాలేయ మార్పిడే! అయితే చివరి దశలో కాలేయంలో ఎక్కువ గడ్డలు ఉన్నా, ఒకే గడ్డ పెద్దదిగా పెరిగిపోయినా, సర్జరీ సఫలమయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సర్జరీ చేసినా మళ్లీ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఇమ్యునోథెరపీతో గడ్డ పరిమాణం తగ్గించి, ఆ తర్వాత కాలేయ మార్పిడి సర్జరీ చేసి క్యాన్సర్‌ను సమూలంగా నయం చేయవలసి ఉంటుంది. ఇమ్యునోథెరపీతో శరీరం క్యాన్సర్‌తో పోరాడే బలాన్ని పుంజుకుంటుంది. ఫలితంగా కణితి కుంచించుకుపోతుంది. అప్పుడు కాలేయ మార్పిడికి పరిస్థితి అనుకూలిస్తుంది. క్యాన్సర్ మొదటి దశలో, అంటే... కాలేయంలో క్యాన్సర్ గడ్డ చిన్నదిగా ఉన్నప్పుడు కూడా మెరుగైన ఫలితం కోసం కాలేయ మార్పిడినే ఆశ్రయించాలి.

ఆధునిక చికిత్సలు ఇవే!

కాలేయంలో తలెత్తే క్యాన్సర్‌లకు వైద్యులు వేర్వేరు చికిత్సలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఒకరికి తగిన చికిత్స ఇంకొకరికి తగినది కాకపోవచ్చు. కాబట్టి ఎవరికి ఎలాంటి చికిత్సా విధానాన్ని ఎంచుకోవాలో, ఏ అనుబంధ చికిత్సలతో ఫలితం మెరుగ్గా ఉంటుందో వైద్యులు అంచనా వేస్తారు. వయసు, క్యాన్సర్ తత్వం, దశ, గడ్డ పరిమాణం, గడ్డ పెరిగిన ప్రదేశం, మునుపటి కాలేయ వ్యాధులు... ఈ అంశాలన్నిటినీ వైద్యులు పరిగణలోకి తీసుకుంటారు. కొందరికి సర్జరీ చేసి గడ్డను తొలగిస్తే వ్యాధి నయమైపోవచ్చు. ఇంకొందరికి నేరుగా కాలేయ మార్పిడి అవసరం పడొచ్చు. ఇంకొంతమందికి ఇతరత్రా చికిత్సలను అందించి, ఫలితం ఆధారంగా తదనంతర చికిత్సలను ఎంచుకుంటారు. ఇలా కాలేయ సర్జరీ, కాలేయ మార్పిడిలకు వెళ్లకుండా, నేరుగా క్యాన్సర్ గడ్డకే చికిత్స చేసే వెసులుబాట్లు కూడా ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగినవి 'టేస్', 'టేర్'. ఈ రెండు చికిత్సల్లో క్యాన్సర్ కణితికి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళం గుండా కణితికే నేరుగా కీమోథెరపీ, లేదా రేడియోథెరపీ ఇవ్వడం జరుగుతుంది. ఈ చికిత్సలతో కొందర్లో క్యాన్సర్ పూర్తిగా నయం అయిపోవచ్చు, ఇంకొందరికి అదనంగా ఇమ్యునోథెరపీ కూడా అవసరం పడొచ్చు.

డాక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్.



మీకు తెలుసా?

ప్లాస్టిక్ నుంచి పలాయనం

ప్లాస్టిక్ ప్రమాదకరమని తెలిసీ దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాం. మన ఊహకందని మార్గాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరుకుంటూనే ఉంది. ఆ ప్లాస్టిక్ మహమ్మారి నుంచి ఎలా తప్పించుకోవచ్చో తెలుసుకుందాం!

ప్లాస్టిక్ వస్తువుల్లో ప్రమాదకర బిస్ఫినాల్ రసాయనం దాగి ఉంటుంది. ప్లాస్టిక్ వేడికి గురయినప్పుడు ఈ రసాయనం బయటకు వచ్చేస్తూ ఉంటుంది. నిల్వ పదార్థాలను ప్లాస్టిక్ సీసాలో నింపేటప్పుడు, మూతను స్టెరిలైజ్ చేస్తారు. ఆ క్రమంలో వేడి వెలువడి, ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు పదార్థాల్లో కలుస్తాయి. సూపర్ మార్కెట్‌లో నీళ్ల డబ్బాలు కొంటూ ఉంటాం. కానీ ఆ సీసాలు షాపుకు చేరే లోపు ఎంతసేపు ఎండకు గురయ్యాయి? దుకాణాల్లో వాటిని నిల్వ చేసే జాగా లేక, బయట ఉంచి, తర్వాత ఫ్రిజ్‌లో పెట్టారా? అనేది ఎవరికి తెలుసు? ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్లాస్టిక్ లంచ్ బాక్సుల్లో పదార్థాలు సర్దుకుంటున్నాం! కానీ పదార్థాలు చల్లారేంత సమయం ఆగుతున్నామా? ఓవెన్‌లో పదార్థాలు వేడిచేసే పాత్రలు ప్రధానంగా ప్లాస్టిక్‌తోనే తయారవుతూ ఉంటాయి. పిల్లలు ఆడుకునే వస్తువుల్లో 90% ప్లాస్టిక్‌వే! కర్రీ పాయింట్ నుంచి కూరలు తెచ్చుకున్నా, టీ షాపు నుంచి టీ తెప్పించుకున్నా, వాటిని ప్యాక్ చేస్తున్నదీ ప్లాస్టిక్ కవర్లలోనే!

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు ఇవే!

టూత్‌బ్రష్ లాంటి కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలు (వేప పుల్ల) ఉన్నా ఉరుకులు పరుగుల జీవితంలో వాటిని పాటించడం కొంత కష్టం. కాబట్టి తప్పనిసరిగా ఉపయోగించవలసివచ్చే కొన్ని ప్లాస్టిక్ వస్తువుల్లో మేలైనవి, బిపిఎ ఫ్రీ రకానికి చెందినవే ఎంచుకోవాలి. ఆ వస్తువులు కొనే సమయంలో, లేబుల్ మీద బిపిఎ ఫ్రీ అని రాసి ఉందో, లేదో గమనించాలి. సాధారణంగా ప్రసిద్ధ కంపెనీలు తయారుచేసే ప్లాసిక్ వస్తువులు ఈ కోవకే చెంది ఉంటాయి. కాబట్టి ప్లాస్టిక్ నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. అలాగే కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వస్తువులు ఎంచుకోవాలి. అవేంటంటే....

- **ప్లాస్టిక్ బాటిల్**
  ప్రత్యామ్నాయం: గాజు సీసా, స్టీలు లేదా రాగి బాటిల్
- **ప్లాస్టిక్ గిన్నెలు**
  ప్రత్యామ్నాయం: ఓవెన్‌లో గాజు లేదా పింగాణీ గిన్నెలే వాడాలి.
- **ప్లాస్టిక్ ప్లేట్లు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ ప్లేట్లలో భోజనం చేయాలి

మూడు తరాల వరకూ...

ప్లాస్టిక్ వాడకంతో శరీరం మీద పడే దుష్ప్రభావాలు మూడు తరాల వరకూ కొనసాగుతాయి. బాల్యంలో, యుక్తవయసులో, మధ్య వయసులో... ఇలా జీవితంలోని మూడు దశల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తాయి. అండాలు, వీర్యకణాల డిఎన్ఎల్లో తేడాలు ఏర్పడి, మూడు తరాల వరకూ పునరుత్పత్తి సమస్యలు వంశపారంపర్యంగా కొనసాగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి సాధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడాలి.



- **ప్లాస్టిక్ కప్పులు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ కప్పులు
- **ప్లాస్టిక్ ఆట వస్తువులు**
  ప్రత్యామ్నాయం: సాఫ్ట్ టాయిస్
- **ప్లాస్టిక్ స్ట్రా**
  ప్రత్యామ్నాయం: స్టీలు స్ట్రా

పోషణ

మహిళలు - పోషకాలు!


మహిళలకు కొన్ని పోషకాలు అత్యవసరం. వీటి లోపం ఏర్పడితే కీలకమైన జీవక్రియలు అదుపు తప్పుతాయి. కాబట్టి పోషకాలు, వాటి అవసరాల గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి.

- **ఇనుము:**
  ఇనుము శక్తినిస్తుంది. ఆక్సిజన్ శరీరంలో సక్రమంగా ప్రసరించడానికి కూడా ఇనుము అవసరమే! వ్యాధినిరోధకశక్తి, కండరాల పనితీరు మెరుగ్గా ఉండాలన్నా తగుమాత్రం ఇనుము తీసుకోవడం తప్పనిసరి.
- **బి12:**
  మెదడు, నాడీవ్యవస్థ, రక్తకణాల పనితీరుకు బి12 సరిపడా ఉండాలి. శరీరం హుషారుగా ఉండాలంటే బి12 తగు ప్రమాణాల్లో శరీరానికి అందాలి.
- **బయోటిన్:**
  చర్మం, వెంట్రుకలు, గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత బయోటిన్ అందేలా చూసుకోవాలి. నాడీ, జీర్ణ, గుండె సంబంధ జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా ఈ పోషకం అందాలి.
- **క్యాల్షియం:**
  బలమైన ఎముకల కోసం క్యాల్షియం అవసరం. గుండె, కండరాలు, నాడులు చురుగ్గా పని చేయాలన్నా క్యాల్షియం సరిపడా తీసుకోవాలి.
- **మెగ్నీషియం:**
  నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం దొరకాలన్నా, నెలసరి సమస్యలు తొలగాలన్నా, నీరసం, ఒళ్లు నొప్పులు వదలాలన్నా మెగ్నీషియం సమృద్ధిగా తీసుకోవాలి.



ఊబకాయం

పిల్లలు ముద్దుగా బొద్దుగా ఉండాలి అని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అయితే పిల్లల బరువు వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవరోధం కాకుండా చూసుకోవాలి. ఊబకాయానికి ఆస్కారం లేని పిల్లల పోషకాహారం మీద ప్రతి తల్లీ దృష్టి పెట్టాలి.



బొద్దు ముద్దు కాదు

శారీరక శ్రమ కొరవడడం, బయటి ఆహారం తినే అలవాటు పెరగడం పిల్లల ఊబకాయానికి ప్రధాన కారణాలు. అలాగే ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం, చక్కెర, మైదాలతో తయారయ్యే చిరుతిళ్లు, పానీయాలు తాగే అలవాటు కూడా పిల్లల్లో పెరిగిపోతోంది. వీటన్నిటి వల్ల పిల్లల్లో ఊబకాయ సమస్య పెరిగిపోతోంది. కానీ పిల్లల భోజనానికి కొన్ని పోషక నియమాలున్నాయి. వాళ్ల భోజనంలో 30% పిండిపదార్థాలు, 30% కూరగాయలు, ఆకుకూరలు, 20% పండ్లు, 15 నుంచి 20% మాంసకృత్తులు, 5 నుంచి 10% (500 మిల్లీలీటర్లు) పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండు సార్లు పండ్లు, ప్రతి భోజనంలో కూరగాయలు, వయసును బట్టి రోజుకు ఒకసారి నట్స్‌ను నేరుగా అందించడం లేదా పొడి చేసి పాలలో కలిపి ఇవ్వడం చేస్తూ ఉండాలి. ఏడాది వయసు దాటిన పిల్లలైతే రెండేళ్ల వయసొచ్చేవరకూ వెన్న తీయని పాలు ఆ తర్వాత వెన్న తీసిన పాలు ఇవ్వాలి. వంట నూనెల విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకూ గానుగ నూనెలు వాడుకోవాలి. అలాగే నూనెలో ముంచి వేయించిన పదార్థాలు తగ్గించాలి. వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడే అలవాటు మానుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే స్థూలకాయం దరి చేరదు.

తల్లితండ్రులే ఆదర్శం

ఇప్పటికే స్థూలకాయులుగా మారిన పిల్లల విషయంలో మరీ ముఖ్యంగా తల్లితండ్రులు వారికి ఆదర్శంగా మారాలి. తల్లితండ్రులు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అనుసరిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. లావుగా ఉన్న పిల్లలను 'లావుగా ఉన్నావు' అంటూ కించపరచడం వల్ల వాళ్లు మానసికంగా కుంగిపోతారు. కాబట్టి 'బరువు పెరగడం అనారోగ్యకరం, ఆరోగ్యకరమైన ఆహారం తింటూ, ఒళ్లు అలసిపోయేలా ఆడుకోవాలి' అంటూ పిల్లలను ప్రోత్సహించాలి. హోటల్ భోజనాలకు, స్విగ్గీ, జొమాటోలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పరిమితం చేయాలి. పాలిష్ పట్టని బియ్యం వాడుకుంటూ, భోజనంలో అన్నంతో సమానంగా కూరలు తినేలా పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలు విపరీతమైన ఊబకాయంతో బాధపడుతున్నప్పుడు పిల్లల వైద్యులను తప్పక కలవాలి.

చక్కెరకు దూరంగా...

పిల్లలను చక్కెరకు వీలైనంత దూరంగా ఉంచాలి. తీపి పదార్థాల పట్ల వ్యామోహం ఏర్పడకుండా చూసుకోవాలి. అరుదుగా, పరిమితంగానే పిల్లలకు తీపిపదార్థాలు అందించాలి. చక్కెర కంటే బెల్లం మేలు అనేది కూడా అపోహే! చక్కెర కంటే బెల్లంతో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి. పాలల్లో కలిపే బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో కూడా చక్కెర ఉంటుంది. వీటి వల్ల పిల్లలకు అదనంగా ఒరిగే ప్రయోజనం కూడా ఏమీ ఉండదు. పసికందులకు పోత పాలు పట్టించేటప్పుడు కూడా చక్కెర కలపకుండా ఇవ్వాలి.

పిల్లల ఆహారం గురించి తల్లుల్లో ఎన్నో అనుమానాలు ఉంటూ ఉంటాయి. పిల్లలు సరిపడా తినరేమోననే భయంతో స్వయంగా తినిపించడం, బలవంతంగా కూరడం లాంటివి చేస్తూ ఉంటారు. కానీ చిన్న వయసు నుంచే పిల్లలు స్వయంగా తినేలా తల్లులు అలవాటు చేయాలి.

ఈ సమస్యలు తప్పవు

పిల్లల్లో ఊబకాయం వల్ల తక్షణమే ఆరోగ్య సమస్యలు బయల్పడకపోయినా, భవిష్యత్తులో కీళ్ల నొప్పులు, మధుమేహం, అధిక రక్తపోటు, యుక్తవయసులోనే గుండెపోటు, తిన్న వెంటనే వాంతి తెచ్చుకునే 'బులీమియా' లాంటి మానసిక సమస్యలు చిన్న వయసు నుంచే మొదలవుతాయి. కొన్ని రకాల హార్మోన్ల సమస్యలున్నప్పుడు కూడా పిల్లలు ఊబకాయుల్లా మారిపోతారు. పిల్లలు ఎత్తు పెరగకుండా, బరువు పెరుగుతుంటే, హార్మోన్ అసమతౌల్యంగా భావించి ఎండోక్రైనాలజిస్ట్ చేత పరీక్షలు చేయించాలి. పిల్లలకు రోజుకు గంట వ్యాయామం తప్పనిసరి. పరుగు, సైకిల్ తొక్కడం, ఈత, బ్యాడ్మింటన్... ఇలా నచ్చిన వ్యాయామం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. పిల్లలు టీనేజీకి చేరుకుని, ఎత్తు పెరగడం ఆగిపోయిన తర్వాతే బరువు లెత్తే వ్యాయామాలు చేయాలి. లేదంటే ఎత్తు పెరగడం ఆగిపోతుంది.

డాక్టర్ శివరంజని సంతోష్
సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్స్ మాగ్నా సెంటర్స్, హైదరాబాద్.

